ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5

శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

మంగళవారం 11 మార్చి 2025



పట్టువస్త్రాలను తెస్తున్న మంత్రి నారా లోకేశ్, పక్కన మంత్రి అనగాని, ఎమ్మెల్యే కందికుంట



మంగళహారతి తీసుకుంటున్న మంత్రి నారా లోకేశ్



కల్యాణోత్సవంలో అమ్మవార్ల మంగళసూత్రాలను భక్తులకు చూపుతున్న వేద పండితులు



కల్యాణోత్సవానికి హాజరైన భక్తజన సందోహం



కన్నుల పండువగా ఖాద్రీశుడి కల్యాణం

పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి నారా లోకేశ్
హాజరైన మంత్రి అనగాని సత్యప్రసాద్

కదిరి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీదేవీ, భూదేవీ సమేత ఖాద్రీశుడి కల్యాణోత్సవం సోమవారం రాత్రి కన్నుల పండుగగా జరిగింది. కల్యాణోత్సవానికి ప్రభుత్వం తరఫున మంత్రి నారా లోకేశ్ పట్టు వస్త్రాలను సమర్పించారు. శ్రీమహావిష్ణువు స్వరూపుడైన ఖాద్రీశుడి కల్యాణోత్సవాన్ని సాక్షాత్తూ బ్రహ్మదేవుడు ముందుండి నడిపిస్తారని, ముక్కోటి దేవతలు వీక్షిస్తారని భక్తుల విశ్వాసం. కల్యాణాన్ని కన్నులారా వీక్షిస్తే సకల పాపహరణం జరుగుతుందని నమ్ముతారు. యాగశాలలో కొలువుదీరిన వధువులు శ్రీదేవి, భూదేవిని, వరుడు శ్రీవారిని వేర్వేరుగా పల్లకిలలో కల్యాణ మంటపానికి చేర్చారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ శ్రీవారి ప్రతిరూపంగా విచ్చేసిన కంకణ భట్టాచార్యుల వారు అమ్మవార్లకు సోమవారం రాత్రి 10.07 గంటలకు మాంగళ్య ధారణ గావించారు. కల్యాణోత్సవం ముగిసిన తరువాత శ్రీవారు, అమ్మవార్లపై నుంచి జాలువారిన ముత్యాల తలంబ్రాలను దక్కించుకునేందుకు భక్తులు పోటీ పడ్డారు. వేలాది మంది భక్తులు తరలివచ్చి ఈ వేడుకను తిలకించారు. కల్యాణోత్సవం తరువాత శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారికి భక్తులు కానుకలను చదివించుకున్నారు. వేడుకలలో దేవదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్, ఈఓ శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, ఆర్డీఓ వీవీఎస్ శర్మ, అర్చకులు, ఆయల సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వం తరఫున..

ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామికి ప్రభుత్వం తరఫున మంత్రి నారా లోకేశ్ పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయ ముఖ ద్వారం నుంచి నారా లోకేశ్ పట్టువస్త్రాలను తీసుకువచ్చారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం స్వామివారికి సమర్పించారు. స్వామి వారి కల్యాణోత్సవాన్ని వీక్షించి, వేదపండితుల ఆశీస్సులు అందుకున్నారు. వేదపండితులు వసంత వల్లభుడికి నారా లోకేశ్‌తో సంకల్పం చేయించారు. ఆయన వెంట రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్

(మిగతా 6వ పేజీలో...)



కల్యాణోత్సవం సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ

భూ దోపిడీ..!



సర్వే నంబరు 650-2లో చేపడుతున్న నిర్మాణాలు

- రూ.50 కోట్ల స్థలాలు పేదల పేరిట స్వాహా
- ప్లంబర్స్ యూనియన్ ముసుగులో ఇష్టారాజ్యం
- 22 ప్లాట్లు కుటుంబ సభ్యులు, బినామీల పేరిట..
- 650-2 సర్వే నంబరులో అడుగడుగునా అక్రమాలే
- వైసీపీ నాయకుల చేతిలోకి విలువైన ప్లాట్లు
- అక్రమార్కులకు కూటమి నేతల సహకారం
- అప్పటి రెవెన్యూ అధికారికీ వాటా

ధర్మవరం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): యూనియన్ పేరుతో భారీగా భూ దోపిడీకి పాల్పడిన వ్యవహారం ఇది. యూనియన్ నేతలే సభ్యులకు శఠగోపం పెట్టి వీధి పాలు చేశారు. యూనియన్ ముసుగులో కొందరు వ్యక్తులు ఏకంగా రూ.50 కోట్లకు పైగా విలువైన స్థలాన్ని కుటుంబ సభ్యులు, బినామీలు, సహకరించిన రాజకీయ నాయకులకు అప్పనంగా దోచిపెట్టారు. ధర్మవరం పట్టణానికి చెందిన ప్లంబర్స్ యూనియన్ పేరుతో చేసిన దోపిడీ అంతాఇంతా కాదు. రూ.50 కోట్లకు పైగా విలువచేసే భూమిని ప్లాట్లుగా విభజించి ఆ యూనియన్‌లోని ఇద్దరు అన్నదమ్ములు మరో యూనియన్ నాయకుడితో పాటు గత ప్రభుత్వ హయాంలో కొందరు వైసీపీ నాయకులు ఏకమై దోచేశారు. వివాదంలో ఉన్న ఈ భూమి కోసం కోర్టుకు వెళ్లిన వారికి కూడా మొండిచేయి చూపి.. తమకున్న అధికార, యూనియన్ బలంతో ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. గత ప్రభుత్వంలోని ఓ తహసీల్దార్ సహకరించడంతో వారి అక్రమాలకు హద్దులేకుండా పోయింది. ధర్మవరం-పుట్టపర్తి ప్రధాన రహదారికి ఆనుకుని ఉండే 650-2 సర్వే నెంబర్‌లోని అత్యంత విలువైన భూమిని దోచేశారు. ఇక్కడ ఎకరం రూ.25 కోట్ల నుంచి రూ.30 కోట్ల వరకు పలుకుతోంది. ఇందులో యూనియన్ పేరుతో ముగ్గురు వ్యక్తులు దాదాపు రూ.30కోట్లు విలువైన ఆస్తులను బినామీ పేర్లతో దోచేయగా వైసీపీకి చెందిన కొందరు వ్యక్తులు రూ.10కోట్ల మేర నొక్కేశారు. మిగిలిన యూనియన్‌లోని కొందరికి పంచేసి చేతులు దులుపుకున్న వ్యవహారం ధర్మవరం పట్టణంలో ఆలస్యంగా వెలుగుచూసింది.

అసలు కథేంటంటే..

ధర్మవరం పట్టణం లక్ష్మీచెన్నకేశవపురం సర్కిల్‌లో 650-2 సర్వేనెంబరు నందు దేవదాయ శాఖకు చెందిన రెండు ఎకరాల భూమి ఉండేది. ఇందులో వెనుక భాగాన బేల్దార్లకు, మధ్య భాగంలో కార్పెంటర్లకు, ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉండే భూమిని ప్లంబర్స్‌కు కేటాయించారు. అంతకంటే ముందే పట్టణానికి చెందిన నలుగురు వ్యక్తులు దేవదాయశాఖకు చెందిన ఓ పూజారితో రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్టు తెలుస్తోంది. దీంతో ఆ యజమానులు ఆ భూమి తమదేనంటూ కోర్టుకెక్కారు. అప్పటి నుంచి ఆ భూమి యజమానులుగా చెప్పుకుంటున్న నలుగురు వ్యక్తులకు, ప్లంబర్స్‌కు మధ్య వివాదం కొనసాగుతూవచ్చింది. గోనుగుంట్ల సూర్యనారాయణ ఎమ్మెల్యేగా ఉన్న హయాంలో ఇరువురిని రాజీకి ఒప్పించి కొంతవరకు సఫలమయ్యారు. అంతలోనే ఎన్నికలయ్యాక వైసీపీ ప్రభుత్వం రావడంతో ప్లంబర్స్ యూనియన్‌కు చెందిన కొందరు వ్యక్తులు ఆ పార్టీలో చేరారు. ఆ సమస్య పరిష్కారం కోసం అప్పటి ఎమ్మెల్యేను అభ్యర్థించారు. ఆయన సూచన మేరకు వైసీపీలోని ఓ కౌన్సిలర్ భర్త ఇద్దరికి పంచాయితీ చేసినట్టు తెలుస్తోంది. ఆ వైసీపీ నాయకుడితో పాటు మరో ఇద్దరి వైసీపీ నాయకులకు విలువైన స్థలాలు ఇచ్చేవిధంగా.. మిగిలిన స్థలాన్ని ఆ యూనియన్‌లోని ముగ్గురికి వారు కోరిన విధంగా పట్టాలు పొందేలా ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలుస్తోంది. దీంతో ఆ విలువైన ఆస్తిని ప్లాట్లుగా విభజించి ఆ యూనియన్‌లోని ము గ్గురి నాయకులతో పాటు వైసీపీకి చెందిన కొందరు వ్యక్తులు తమ బినామీ పేర్లతో దోచేశారు. ఆ యూనియన్‌లోని ముగ్గురు నాయకులు 31 ప్లాట్లు తీసుకోవడంతో పాటు అందులోనూ వారి ప్లాట్లు అధిక విస్తీర్ణం చేసుకోవడం విశేషం. వీటి ఖరీదులో పట్టణం నడిబొడ్డున ధర కన్నా ఎక్కువ పలుకుతున్నట్లు తెలుస్తోంది.

సోదరులు, యూనియన్ నాయకుడిదే హవా

యూనియన్ పేరు చెప్పుకుని ఈ స్థలం రాబట్టేందుకు ఎంతో కృషిచేశామని పలువురి వద్ద చెప్పుకుంటూ ఆ యూనియన్‌లోని ఇద్దరు అన్నదమ్ముల తోపాటు మరో నాయకుడు చేసిన అక్రమాలు అన్నీఇన్నీ కావు. తల్లి, భార్య, కుమారులు, మరదళ్లు, తోడల్లుడు, అల్లు డు, అత్త, మామల పేర్లతో సైతం పట్టాలు పొందారు. అన్నదమ్ముల్లో ఒక వ్యక్తి 23, 25, 26, 27, 31, 69, 47, 56, 19, 21 గల ప్లాట్లను, మరొకరు 14, 15, 16, 29, 40, 41, 66, 48, 57, 58, 19, 28 ప్లా ట్లను, మరో యూనియన్ నాయకుడు 7, 12, 8, 13, 17, 22, 63, 71, 72 ప్లాట్లను కుటుంబీకులు, సన్నిహితులు, బినామీ పేర్లతో దోచేసినట్టు యూనియన్ వర్గాల ద్వారా తెలుస్తోంది. వీరికి సహకరించిన వైసీపీకి చెందిన కొం ద రు నాయకులకు 53, 24, 70, 61, 76, 30, 3 6, 38, 67, 73 నెంబర్ల గల ప్లాట్లను అప్పన్నంగా పట్టాలు చేయించినట్టు రెవిన్యూ వర్గాల ద్వారా తెలుస్తోంది.

అప్పటి రెవెన్యూ అధికారికీ వాటా

ప్లంబర్స్ యూనియన్‌లో జరుగుతున్న అవినీతి, అక్రమాలకు సహకరించి, వారికి అనుకూలంగా పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చినందుకు నజరానాగా.. అప్పటి రెవెన్యూ అధికారికి బినామీ పేర్లతో రెండు ప్లాట్లు ఇచ్చినట్టు విశ్వసనీయ సమాచారం. వీటితో పాటు మరో రెండు ప్లాట్లను సైతం సదరు అధికారి, యూనియన్‌లోని ఇద్దరు నాయకులు కలిసి దాదాపు రూ.కోటి దాకా అమ్మేసి వాటాలు పంచుకున్నట్టు సమాచారం. అందరూ ఏకం కావడంతో నిజమైన ప్లంబర్స్ న్యాయం జరగలేదు.

కూటమి నేతలు సైతం దాసోహం

'గతంలో ఏ పార్టీ, ఎవరెవరు తిన్నారో మాకు అనవసరం.. ఇప్పుడు మాది మాకు ఇచ్చేస్తే మీవైపు కన్నె త్తి చూడం' అన్నట్లు ప్రస్తుత వ్యవహారం జరుగుతోం ది. కూటమిలోని ఓ ముఖ్య పార్టీ నాయకులు సైతం అక్రమాలకు పాల్పడిన యూనియన్ నాయకులకు బాసటగా నిలవడంలో మతలబుఏమిటో అంతుబట్ట ని విధంగా ఉందని బాధితులు ఆరోపిస్తున్నారు.

విచారించి చర్యలు తీసుకుంటాం

650-2 సర్వేనెంబరులో అక్రమార్కులు పట్టాలు తీసుకున్నట్టు మా దృష్టికి వచ్చింది. వీటిపై పూర్తి స్థాయిలో విచారణ చేసి అనర్హులకు ఇచ్చిన బోగస్ పట్టాలను రద్దుచేసేందుకు చర్యలు తీసుకుంటాం. అసోషియేషన్ ముసుగులో ఎవరైనా అనర్హులు పట్టాలు పొందితే చర్యలు తీసుకుంటాం.

- నటరాజ్, తహసీల్దార్, ధర్మవరం

భూస్వాహాపై నిగ్గు తేల్చండి

సర్వే నంబర్ 650-2లో అక్రమాలపై విచారణ జరిపించాలి

డీఆర్వోకు సీపీఐ ఫిర్యాదు

ధర్మవరం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ధర్మవరం పట్టణంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవపురంలో సర్వే నంబరు 650-2లో జరిగిన అవినీతి, అక్రమా లపై విచారణ జరిపించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు డీఆర్వో విజయసారథికి ఫిర్యాదు చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్వోను కలిసి అక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ.. సర్వే నంబరు 650-2లో రూ.50 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని ప్లంబర్స్ యూనియన్ నాయకులు బినామీ పేర్లతో నొక్కే శారని తెలిపారు. అప్పటి తహసీల్దార్ రమేశ్ అక్రమార్కులకు పూర్తిగా సహకరించారని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికార పార్టీని అడ్డుపెట్టుకుని ప్లంబర్స్ యూనియన్ ముసుగులో ముగ్గురు వ్యక్తులు దాదాపు 30 నుంచి 35 పట్టాలు బినామీ పేర్లతో దోచేశారని అన్నారు. వారికి సహకరించినందుకు అప్పటి ఎమ్మెల్యే కేతిరెడ్డి అనుచ రులకు కూడా 10 పట్టాలు ఇచ్చారని తెలిపారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో నాయకులు రవి, రమణ, పోలా లక్ష్మీనారాయణ, రాజా, ప్లంబర్స్, భూ యాజమానులు ఉన్నారు.



డీఆర్వో విజయసారథికి వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

దళిత ద్రోహి జగన్ రెడ్డి: ఎంఎస్ రాజు



మడకశిర టౌన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ఐదేళ్లపాటు దళితులను అవమానించిన ద్రోహి జగన్ రెడ్డి అని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మండిప డ్డారు. అసెంబ్లీ సమావేశాల్లో దళితులకు గత ప్రభుత్వంలో జరిగిన అవమానాల గురించి సోమవారం ఆయన మాట్లాడారు. దళిత బిడ్డ బాలయోగిని చంద్రబాబు దేశంలో అత్యున్నతమైన పార్లమెంట్ స్పీకర్‌ను చేశారని అన్నారు. అదే దేశం ముందు దళితులను జగన్ అవమానపర్చారని అన్నారు. ఒక దళితుడు డాక్టర్ వృ త్తిలో కొనసాగాలంటే ఎన్నో కష్టాలు ఉంటాయని, అలాంటి డాక్టర్‌ను నడిరోడ్డుపై అవమానించి, ఆయన మృతికి జగన్ కారణం కాలేదా అని ప్రశ్నించారు. ఒక డ్రై వర్‌ను హత్యచేసి డోర్ డెలివరీ చేసినా.. బాధ్యులపై చర్యలు తీసుకోలేదన్నారు. వెనకబడిన వర్గాలన్నా, దళితులన్నా జగన్‌కు చిన్న చూపు అని అన్నారు.

ఇంటర్ పరీక్షలకు 140 మంది గైర్హాజరు

కొత్తచెరువు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సోమవారం జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలకు 140 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈఓ రఘునాథరెడ్డి తెలిపారు. జనరల్ కేటగిరి కింద 6339 మంది విద్యార్థులు పరీక్షలు రాయల్సి ఉండగా 6236 మంది పరీక్షలు రాశారని, 103 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు. ఒకేషనల్ పరీక్షకు 1144 మందికి గాను 1107 మంది విద్యార్థులు హాజరయ్యారని, 37 మంది గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు. ముదిగుబ్బ, కదిరి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసినట్లు వెల్లడించారు.



సాగు నీరు కట్టిన అనంతరం పచ్చగా మారిన మిరప పొలం



జీబీసీలో ప్రవహిస్తున్న సాగు నీరు

సాగు నీరు కట్టిన అనంతరం ఎర్రగా మారిన మిరప కాయలు

మిరప సాళ్లలో నీరు పారుతున్న దృశ్యం

జీబీసీ రైతుల ఆశలకు కూటమి ప్రభుత్వం ప్రాణం పోసింది. మిరప పంట చివరి దశలో ఉన్న సమయంలో నీటి సరఫరా ఆగిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందారు. పంట దెబ్బతిని, తీవ్రంగా నష్టపోతామని మథనపడ్డారు. ఇదే విషయాన్ని ఉరవకొండ నియోజక వర్గంలోని రైతులు మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి తీసుకెళ్లారు. నీరు ఇప్పించాలని విన్నవించారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం కర్ణాటకలోని తుంగభద్ర డ్యాం అధికారులతో చర్చించి సాగు నీరు విడుదల చేయించింది. జీబీసీకి వారం రోజులుగా సాగు నీరు వస్తుండటంతో వివిధ గ్రామాల్లోని రైతులు మిరప పంటకు తిప్పుకుని పంటలను కాపాడుకుంటున్నారు. - ఆంధ్రజ్యోతి, విడపనకల్లు

హమ్మయ్యా

రంగు ఎక్కుతున్న మిరప కాయలు

సంబరపడుతున్న జీబీసీ ఆయకట్టు రైతులు

చివరి దశలో మిరప పంటకు అందిన నీరు

జీబీసీ ప్రధాన కాలువలో ఎక్కడా ఏ రైతు కూడా అడ్డు కట్టలు వేయకుండా కింది వరకూ సాగు నీరు వెళ్లాలని ఆయా గ్రామాల రైతులు ట్రాక్టర్లలో కాలువపై గస్తీ నిర్వహించారు. ప్రతీ రైతుకు సాగు నీరు అందాలని కోరుతూ పెద్ద పెద్ద మోటార్లతో కూడా సాగు నీరు తోడుకో రాదు అంటూ ప్రచారం నిర్వహించారు. వారం రోజులుగా మండలంలో జీబీసీకి సాగు నీరు వస్తూ ఉండటంతో మిరప చేలు కళకళలాడు తున్నాయి. కాలువలో 250 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుండటంతో పంటకు పూర్తి స్థాయిలో నీరు అందుతోంది. వైసీపీ పాలనలో 2023లో నవంబరు నెలలో సాగు నీరు బంద్ కావటంతో అప్పట్లో మిరప రైతులు సాగు నీరు కోసం రెండు నెలలు పాటు ధర్నాలు రాస్తా రోకో చేశారు. అయినా వైసీపీ నేతలు నాయకులు కనీసం ఒక్క తడి నీరు ఇవ్వలేదు. ఈ సారి మాత్రం మార్చిలో కూడా సాగు నీరు రావటం ఇది కూటమి ప్రభుత్వం చొరవ అనే రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చివరి ఆయకట్టు రైతుల గస్తీ



సాగు నీరు లేక తెల్లగా మారిన మిరప కాయలు

సంతోషంగా ఉంది



నేను 8 ఎకరాల్లో డబ్బీ రకం మిరప పంటను సాగు చేశా. కాపు ఆలస్యం కావటంతో సాగు నీరు లేక మిరప కాయలు రంగు రాకుండా పోయే పరిస్థితి వచ్చింది. అయితే చివరి దశలో జీబీసీకి నీరు రావటంతో పంటకు నీరు అందించా. దీంతో కాయలు కూడా ఎర్రగా మారాయి. గత ప్రభుత్వంలో సాగు నీటి కోసం రోడ్లెక్కి ధర్నాలు, రాస్తా రోకోలు చేసినా చుక్క నీరు ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం మంత్రి పయ్యావులు కేశవ్ చొరవతో జీబీసీ రైతులకు సాగు నీరు అందించి ఆదుకుంది. కాయలు ఎర్రరంగు రావాలంటే చివరి దశలో సాగు నీరు చాలా అవసరం. సకాలంలో సాగు నీరు అందించి మిరప కాయలు మంచి రంగు వచ్చేలా చేసిన కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు.

-జనార్దననాయుడు, జనార్దనపల్లి

పూర్తిగా నష్టపోయేవాళ్లం



నేను 6 ఎకరాల్లో డబ్బీ రకం మిరప సాగు చేశా. జూన్‌లో సాగు చేయగా కాపు ఆలస్యం అయ్యింది. కాయలు రంగు మారే సమయంలో నీరు లేక తెల్లగా మారే పరిస్థితి వచ్చింది. చివరి దశలో సాగు నీరు రావటంతో పంటకు తడులు అందిస్తున్నా. కొంత వరకూ కాయలు రంగు మారుతున్నాయి. ఎర్రగా ఉంటే మంచి ధరలు పలుకుతాయి. చివరి దశలో సాగు నీరు లేక పోయింటే మా పరిస్థితి దిక్కు తోచకుండా ఉండేది. గత ఏడాది సాగు నీరు లేక లక్షల్లో నష్ట పోయాము. కూటమి ప్రభుత్వం, మంత్రి పయ్యావుల మిరప రైతులకు ప్రాణం పోశారు. -బోయ రాజు, జనార్దనపల్లి

రంగు ఉండేది కాదు



పంట చివరి దశలో ఉన్న సమయంలో నీరు లేక కాయల రంగు తగ్గింది. నేను 8 ఎకరాల్లో మిరప పంట సాగు చేశా. ఒక్క తడి నీరు రావటంతో మిరప రైతులకు ప్రాణం లేచి వచ్చినట్లు అయ్యింది. నీళ్ల లేక పంటలు ఎండి పోతున్న సమయంలో సాగు నీరు వచ్చింది. ఈ ఎండలకు మిరప పంటలకు సాగు నీరు కడుతూ ఉండటంతో పంటలు పచ్చగా మారి కాయలు మంచి రంగు ఎక్కుతున్నాయి. ఎర్రగా ఉన్న మిరప కాయలకు మంచి ధర వస్తుంది. చివరి దశలో సాగు నీరు లేక పోయింటే రంగు ఉండేది కాదు,దిగు బడి వచ్చేది కాదు.

-నరేష్, ధర్మపురి

పంట నష్టం అంచనా

తాడిమర్రి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): అదానీ ప్రాజెక్టు నిర్మాణ పనుల కారణంగా పంటలకు జరుగున్న నష్టాన్ని ఉద్యానశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. దుమ్ము కారణంగా తాము పంటలను నష్టపోతున్నామని రైతులు ఆందోళనకు దిగడంతో స్పందించిన అధికారులు, సోమ వారం మండలంలో పర్యటించారు. తహసీల్దార్ భాస్కర్ రెడ్డి సూచనల మేరకు దాడితోట రైతులతో ఉద్యానశాఖ అధికారి అమరేశ్వరి మాట్లాడి, పంటల వివరాలను తెలుసుకున్నారు. పంట నష్టంపై ధర్మవరం రెవెన్యూ డివిజనల్ అధికారికి నివేదిక అందజేస్తామని ఆమె తెలిపారు. వీఆర్‌ఓ సావిత్రి, వీహెచ్‌ఏ రామాంజినేయులు, గొట్లూరు వీహెచ్‌ఏ చరిత్, వీఆర్‌ఏ రాజశేఖర్, సూరి తదితరులు పాల్గొన్నారు.



పండ్లతోటలను పరిశీలిస్తున్న హార్టికల్చర్ అధికారి అమరేశ్వరి

కన్నుల పండువగా ఖాద్రీశుడి కల్యాణం



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



అభిమానులతో నారా లోకేశ్ కరచాలనం

(5వ పేజీ తరువాయి)

తదితరులు ఉన్నారు. పట్టువస్త్రాలు సమర్పించేందుకు వచ్చిన లోకేశ్‌కు ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్, ఆలయ వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కల్యాణోత్సవానికి విజయవాడ నుంచి ఆయన ప్రత్యేక విమానంలో సోమవారం సాయంత్రం పుట్టపర్తి విమానాశ్రాయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి ముదిగుబ్బ మీదుగా కదిరికి రోడ్డు మార్గాన చేరుకున్నారు. గ్రామాల్లో అడుగడుగునా ఆయనకు ఘన స్వాగతం లభించింది. కల్యాణోత్సవం అనంతరం ఆయన కడప ఎయిర్‌పోర్టుకు వెళ్లారు. మంత్రి నారా లోకేష్‌కు పుట్టపర్తి నుంచి కదిరి వరకూ అడుగడుగునా ప్రజలు నీరాంజనలు పట్టారు. బాణ సంచా పేలుస్తూ, పూలవర్షం కురిపించారు. లోకేశ్‌తో కరచాలనం చేసేందుకు పోటీ పడ్డారు. అక్కడక్కడ వాహనాన్ని ఆపుతూ లోకేశ్ వారితో మాట్లాడారు. సమస్యలపై వినతిపత్రాలను స్వీకరించారు



చిన్నారికి ముద్దుపెడుతూ...

చిత్తశుద్ధితో అర్జీల పరిష్కారం: కలెక్టర్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తిటౌన్, మార్చి10(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ భవనంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి 218 అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఇచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతినెల మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ప్లాస్టిక్ వస్తువుల వినియోగం వలన జరిగే అనర్థాలను ఈనెల 15న జరిగే కార్యక్రమంలో ప్రజలకు తెలియ జేయాలన్నారు. అన్నిశాఖల హెచ్‌ఓడీలు, గ్రామ, మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించి ప్లాస్టిక్ వలన కలిగే నష్టాలు, ప్రత్యామ్నాయ మార్గాలను సూచించాలన్నారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, డీఆర్‌ఓ విజయసారథి, స్పెషల్‌డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, ఆర్డీఓ సువర్ణ, పరిశ్రమల శాఖ జీఎం నాగరాజు, డీసీహెచ్‌ఓ తిప్పేంద్రనాయక్, డీఎంహెచ్‌ఓ ఫిరోజ్‌బేగం, ఐసీడీఎస్ పీడీ వరలక్ష్మి, ల్యాండ్ సర్వే ఏడీ విజయ శాంతి, మత్స్యశాఖ చంద్రశేఖర్‌రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ శివరంగప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ మల్లికార్జునయ్య, గ్రామ సచివాలయ నోడల్ అధికారి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీ ఫోర్‌లో భాగస్వాములు కండి

సమాజంలో పేదరిక నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయబోతున్న పీ ఫోర్ విధానంలో దాతలు, సంపన్నవర్గాలు, ప్రజలు భాగస్వాములు కావాలని కలెక్టర్ టీఎస్ చేతన్ కోరారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశం భవనంలో పీఫోర్ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. వచ్చే ఉగాది నుంచి ప్రభుత్వం ఈవిధానానికి శ్రీకారం చుట్టనుందన్నారు. ప్రభుత్వం, దాతలు, ప్రజల భాగస్వామ్యంతో పేదరికం లేని సమాజమే లక్ష్యంగా ఈవిధానం అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, డీఆర్‌ఓ విజయసారథి, ఆర్డీఓ సువర్ణ, డీపీఓ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తరగుని భయం

ధాన్యం అమ్మకాల్లో రైతులకు తరుగు భయం

క్వింటా ధాన్యంపై 6 నుంచి 8 కిలోల నష్టం

చేతివాటం చూపిస్తున్న వ్యాపారులు

కొనుగోలు కేంద్రాలు లేక నష్టపోతున్న అన్నదాతలు

యల్లనూరు/పుట్లూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఎన్నో కష్టలు పడి రైతులు పండించిన పంటను వ్యాపారులు తరుగు పేరుతో దోచేస్తున్నారు. అరకొరగా వచ్చిన దిగుబడిని ఇష్టానుసారంగా తూకం వేస్తూ రైతులను మోసం చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా ఏ పంటలోనూ నాణ్యమైన దిగుబడులు రావడం లేదు. ఇదే అదనుగా వ్యాపారులు క్వింటా ధాన్యంపై అదనంగా 6 నుంచి 8 కిలోలు తరుగు పేరుతో తీసుకుంటున్నారు. యల్లనూరు, పుట్లూరు మండలాల్లో వేరుశనగ, పప్పుశనగ, కంది, మొక్కజొన్న, జొన్న, మినుప ౧౧, కొర్రలు పంటలు ఎక్కువగా సాగుచేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా మెట్టపొలాలు ఉండటం, వర్షాలు సకాలంలో కురవకపోవడంతో ధాన్యపు గింజల నాణ్యతలో తేడాలు వస్తుంటాయి. దీని ఆధారంగా కొందరు వ్యాపారులు గింజల్లో నాణ్యతలేదు, రంగుమారింది, నల్లమచ్చలు ఏర్పడ్డాయి, తేమశాతం ఎక్కువగా ఉందంటూ తరుగు తీస్తున్నారు.

ధర తగ్గించకుండానే దోపిడీ

ఈ ఏడాది పుట్లూరు మండలంలో కోత సమయంలో కురిసిన వర్షాలకు పప్పుగింజల్లో నల్లని మచ్చలు ఏర్పడ్డాయి. దీన్ని ఆసరాగా చేసుకున్న వ్యాపారులు క్వింటాపై ధర తగ్గించకుండా 8నుంచి 10కేజీల వరకు అదనంగా దిగుబడి తీసుకున్నారు. పప్పుశనగను ప్రభుత్వం కొనుగోలు చేసే సమయంలో వ్యాపారులు తరుగు ఎక్కువగా తీసుకోవడానికి జంకేవారు. గత మూడేళ్ల నుంచి ఈ మండలాల్లో ప్రభుత్వం అరకొరగా ధాన్యాన్ని కొనుగోలు చేస్తుండటంతో వ్యాపారుల ఆగడాలు పెరిగిపోయాయి. ముఖ్యంగా కంది, మొక్కజొన్న విక్రయంలో కూడా వ్యాపారులు చెప్పిందే రేటు. ధర పెట్టడం ఒక ఎత్తయితే తరుగు తీసుకోవడం మరో రకంగా ఉంది.

ఉదాహరణకు పప్పుశనగ క్వింటాకు రూ.5800 ధర పెడుతూ సరాసరిన క్వింటాకు 5కిలోల తరుగు తీసుకున్నా కిలో రూ.58ప్రకారం రూ.290 రైతు కోల్పోతున్నాడు. అలాగే కందులు క్వింటా ధర రూ.7750 ఉంది. ఈ పంటపై 6 కిలోలకు పైగా తరుగు తీస్తున్నారు. క్వింటా ధాన్యంలో తరుగు కిలో రూ.77.50 ప్రకారం ఆరు కిలోలపై రూ.465 కోల్పోతున్నారు. పది క్వింటాళ్లు పండించిన చిన్న, సన్నకారు రైతులు కూడా ఈ లెక్కన రూ.3వేల నుంచి 5వేల వరకు నష్టపోతున్నారు.



50కిలోల కంది బస్తాపై అదనంగా 3కిలోలు ఉన్న దృశ్యం


కొనుగోలు కేంద్రాలు లేక..

యల్లనూరు మండలంలో గత మూడేళ్ల నుంచి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. దీంతో వ్యాపారులు ఇష్టానుసారంగా ధాన్యం కొనుగోలు చేసి సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పుట్లూరు మండలంలో అడపాదడపా పప్పుశనగ, కంది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రెండు మూడు రోజులకే మూసివేసిన సంఘటనలు ఉన్నాయి. దీంతో రైతులు ధాన్యం విక్రయించడానికి వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది.

జల్లెడ పట్టలేదని..

గతంలో క్వింటా బస్తాతో తూకం వేసేవారు. దీనిపై కేజీ మాత్రమే తరుగు తీసేవారు. ధాన్యంలో ఎక్కడైనా మట్టి, రాళ్ల ఉన్నట్లయితే జల్లెడ పట్టేవారు. ఆ తర్వాత తరుగు లేకుండా తూకం వేసు కొనేవారు. కానీ గత రెండు మూడేళ్ల నుంచి జల్లెడ పట్టే పద్ధతికి స్వస్తిచెప్పి తమ చేతివాటానికి వ్యాపారులు తెరలేపారు. జల్లెడ పట్టలేదు కదా బస్తాపై ఎన్ని కేజీలు ఇస్తారంటూ రైతులతో బేరసారాలకు దిగుతున్నారు. అంతేకాకుండా గతంలో వందకేజీల బస్తాకు బదులు ప్రస్తుతం 50కేజీల బస్తానే ఎంచుకొని రైతులను మరింత దగా చేస్తున్నారు. 50కేజీల బస్తాపై ధాన్యాన్ని బట్టి 3కేజీల నుంచి 4కేజీల వరకు ఇలా క్వింటాపై 6నుంచి 8కేజీల వరకు తరుగు పేరుతో ధాన్యాన్ని అదనంగా తీసుకువెళుతున్నారు.


గతంలో కేజీనే..



గతంలో ఎన్నడూలేని విధంగా ఈ సంవత్సరం పప్పుశనగ కొనుగోలులో తరుగు అంటూ వ్యాపారులు ఎక్కువగా ధాన్యాన్ని తీసుకుంటున్నారు. గతంలో క్వింటా బస్తాపై కేజీ సంచి తూకం, ఒక కేజీ తరుగు తీసుకొనేవారు. ఈ ఏడాది తరుగు 4కేజీలకు పైగా తీసుకుంటున్నారు. దీంతో తీవ్రంగా నష్టపోతున్నాం.

- ఆదిశేషులనాయుడు, పప్పుశనగ రైతు

ప్రభుత్వమే కొనాలి



రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయా లి. పప్పుశనగకు మచ్చలు ఎక్కువ ఉన్నాయని క్వింటాపై 6 కిలోల తరుగు అడుగుతున్నారు. ఇప్పటికే రైతులకు తక్కువ దిగుబడులు వచ్చి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. పెట్టుబడుల కోసం చేసిన అప్పులు తీరడం లేదు. ప్రభుత్వం స్పందించి ధర పెంచి, తరుగు లేకుండా కొనుగోలు చేయాలి.

-రామాంజనేయులు, రైతు సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు

దేవతలారా.. రండి..!

ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం... శాస్త్రోక్తంగా ధ్వజారోహణం

కదిరి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఖాద్రీ నారసింహుడి బ్రహ్మోత్సవాల ప్రారంభానికి సూచికగా సోమవారం ఉదయం ధ్వజారోహణం నిర్వహించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ.. వేద మంత్రోచ్ఛారణల నడుమ గరుడుడి చిత్రపటాన్ని ధ్వజస్తంభంపై ఆవిష్కరించారు. బ్రహ్మోత్సవాలు పూర్తి అయిన తరువాత ధ్వజ పతాకాన్ని అవరోహణం చేస్తారు. వేడుకలలో స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి భక్తులు పాల్గొన్నారు.

నేడు హంస వాహన సేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి భక్తులకు మంగవారం హంసవాహనంపై దర్శనమిస్తారు. తిరువీధుల్లో స్వామి వారు ఊరేగుతారు. ఈ వేడుకను చూసేందుకు భక్తులు తరలివస్తారు.



ధ్వజారోహణం నిర్వహిస్తున్న వేద పండితులు



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు



ఎమ్మెల్యే కందికుంటను ఆశీర్వదిస్తున్న అర్చకులు

న్యూస్ బాక్స్

బీసీల అభివృద్ధే చంద్రబాబు శ్వాస

● అసెంబ్లీలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



హిందూపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): బీసీల అభివృద్ధే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్వాస అని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత స్పష్టం చేశారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా బీసీల అభ్యున్నతికి పెద్ద పీట వేస్తున్నామన్నారు. అసెంబ్లీలో సోమవారం మంత్రి సవిత మాట్లాడారు. బీసీల అభివృద్ధికి ఎన్నడూలేనంతగా బడ్జెట్‌లో రూ.33,878.45 కోట్లు కేటాయించినందుకు సీఎం చంద్రబాబునాయుడుకు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కి ధన్యవాదాలు అన్నారు. బీసీ కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధికి ఆర్థిక సాయం అందిస్తున్నారన్నారు. స్వయం ఉపాధి పథకాల అమలు చేస్తున్నామన్నారు. సీఎస్ సహా కీలక పోస్టుల్లో బీసీలకు ప్రాధాన్యమిచ్చారన్నారు. బీసీ పిల్లల విద్య కోసం అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. బీసీ హాస్టళ్లు, ఎంజేపీ స్కూళ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేశామన్నారు. త్వరలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో బీసీ స్టడీ సర్కిళ్ల ఆధ్వర్యంలో 26 జిల్లాల్లోనూ ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్లను నిర్వహిస్తామని చెప్పారు. మహిళలు, ఇతరుల కోసం ఆన్‌లైన్ శిక్షణ ఇస్తామన్నారు. సివిల్ సర్వీసెస్‌కు కోచింగ్ ఇప్పిస్తామన్నారు. టీడీపీకి దక్కిన మూడు ఎమ్మెల్సీలను బడుగుబలహీన వర్గాలకు కేటాయించడంపై మంత్రి హర్షం వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో బీసీలపై జరిగిన దాడులపై మండిపడ్డారు. గత ప్రభుత్వంలో బీసీలు, ఆ సామాజిక వర్గానికి చెందిన నాయకులపై తప్పుడు కేసులు బనాయించి, వేధించారన్నారు. 200 మందికి పైగా బీసీలు హత్యకు గురయ్యారనీ, 2600 మందిపై అక్రమ కేసులు పెట్టారని మండిపడ్డారు. ఒక్కచాన్స్ అంటూ బడుగుబలహీన వర్గాలతో ఓట్లేయించుకుని అధికారంలోకి వచ్చిన జగన్ బీసీ బిడ్డలను అన్నివిధాలా అణగదొక్కారని మంత్రి సవిత మండిపడ్డారు.

బీసీ హాస్టళ్లలో సౌకర్యాలు కల్పించండి

● రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత



అనంతపురం, మార్చి10(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ వసతిగృహాల్లో సౌకర్యాలు కల్పించాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీలో సోమవారం ఆమె మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రభుత్వ వసతిగృహాలు, పాఠశాలలు అధ్వానస్థితికి చేరాయన్నారు. గత పాలకులు నిర్లక్ష్యం కారణంగా పేద విద్యార్థులకు సరైన వసతులు అందక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి రూ.47వేల కోట్లు నిధులు కేటాయించి వారి అభివృద్ధికి తోడ్పాటు నందించిందన్నారు. గతంలో బీసీల విద్యార్థుల కోసం పాఠశాలలు, వసతిగృహాలు ఏర్పాటు చేశారన్నారు. అందులో భాగంగానే రాప్తాడు నియోజకవర్గంలోని ననసకోటన మీపంలో గత టీడీపీ ప్రభుత్వంలో ఎంజేపీ బాలికల పాఠశాల నిర్మించి రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిపారన్నారు. ప్రస్తుతం ఆ పాఠశాలను జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి ఆమె ధన్యవాదాలు తెలిపారు. అయితే జిల్లాలోని బీసీ వసతిగృహాలు, ఎంజేపీ, మోడల్ పాఠశాలల్లో విద్యార్థులకు తగినన్ని మరుగుదొడ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. చెన్నేకొత్తపల్లి బీసీ బాలుర వసతిగృహం, పేరూరు ఎంజేపీ బాలుర పాఠశాల, కనగానపల్లి మోడల్ పాఠశాలల్లో మౌలిక వసతులు కరువయ్యాయన్నారు. వెనుకబడిన అనంత జిల్లాలో పేద విద్యార్థులు చదువుకునేందుకు సౌకర్యాలు కల్పించాలన్నారు. బీసీలకు ఇస్తున్న సబ్సిడీ రుణాల సంఖ్యను మరింత పెంచాలని కోరారు. అసెంబ్లీలో తాను ప్రస్తావించిన అంశాలు సూటిగా, స్పష్టంగా ఉన్నాయని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు అభినందించారని ఆమె తెలిపారు.

కరెంటు చార్జీలు తగ్గించండి

● ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి



తాడిపత్రి, మార్చి10(ఆంధ్రజ్యోతి): పరిశ్రమలు బాగుపడాలంటే విద్యుత్ చార్జీలు తగ్గించి, రాయితీలు ఇవ్వాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. అసెంబ్లీలో సోమవారం ఆయన మాట్లాడుతూ 25 ఏళ్ల కిందట తాడిపత్రి నియోజకవర్గంలో సాగు, తాగునీరు ఇబ్బందిలేకుండా మంచి పంటలు పండేవన్నారు. కొంతకాలంగా సాగు, తాగునీరు లేకపోవడంతో పరిశ్రమల స్థాపనకు కృషి చేశారు. కానీ ఈ ప్రాంతంలో రా మెటీరియల్ లేకపోయినా వందల కిలోమీటర్ల దూరం నుంచి తెచ్చి గ్రానైట్, నల్లబండల పరిశ్రమలు స్థాపించి 30వేల నుంచి 40వేల వరకు కార్మికులకు ఉపాధి కల్పించేవారు అన్నారు. దాదాపు 1800 పరిశ్రమలు ఉండేవని వాటి వల్ల నియోజకవర్గంలోని ప్రజలు, వ్యాపారస్తులు బాగుండేవారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే విద్యుత్ చార్జీలు పెంచడం, రాయితీలు తగ్గించడంతో అనేక పరిశ్రమలు మూతపడ్డాయన్నారు. దీనివల్ల దాదాపు 20వేల మంది కార్మికులు రోడ్డున పడ్డారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. లోకేష్ పాదయాత్ర సందర్భంగా కూడా ఈ విషయాన్ని ఆయన దృష్టికి తెచ్చినట్లు వెల్లడించారు. ప్రస్తుతం పరిశ్రమలకు విద్యుత్ చార్జీలు యూనిట్‌కు రూ.8 నుంచి 9వరకు ఉన్నాయని వాటిని రూ.2లకు తగ్గించాలని డిమాండ్ చేశారు. దీనిపై జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, పరిశ్రమలశాఖ మంత్రి ప్రత్యేక చొరవ చూపాలని కోరారు.

లక్ష్యం దిశగా..

ఫీజు వసూళ్లలో మార్కెట్ కమిటీల ముందడుగు

● రూ.12.06కోట్లకు.. రూ.9.97 కోట్లు వసూలు

● టార్గెట్ పూర్తి చేసిన రాయదుర్గం కమిటీ

అనంతపురంరూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మార్కెట్ కమిటీలు ఫీజు వసూళ్లలో లక్ష్యం వైపు సాగుతున్నాయి. ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు చేరుతుండటంలో జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులు టార్గెట్ల సాధనకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలోని రెండు మార్కెట్ కమిటీలు మినహా మిగిలిన అన్ని కమిటీలు లక్ష్యం వైపులు అడుగులు వేస్తున్నాయి. ఇందులో ఇప్పటికే రాయదుర్గం మార్కెట్ కమిటీ లక్ష్యాన్ని పూర్తి చేసింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి జిల్లా మార్కెటింగ్ శాఖకు 12.06కోట్ల మార్కెట్ ఫీజు లక్ష్యాన్ని సంబంధి త శాఖ ఉన్నతాధికారులు నిర్దేశించారు. ఫిబ్రవరి ఆఖరికి రూ.9.97కోట్ల లక్ష్యాన్ని చేరుకుంది. ఈనెల ఆఖరుకు ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతో అధికారులు నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలని ప్రయత్నాలు చేస్తున్నారు.



అనంతపురం మార్కెట్ యార్డు



మార్కెటింగ్ శాఖ ఏడీ కార్యాలయం

రెండు మినహా...

జిల్లాలో తొమ్మిది మార్కెట్ కమిటీలున్నాయి. ఇందులో రాప్తాడు, ఉరవకొండ మార్కెట్ కమిటీలు మినహా మిగిలినవి లక్ష్య సాధనలో ముందున్నాయి. రాయదుర్గం మార్కెట్ కమిటీ ఫిబ్రవరి ఆఖరుకు నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేసింది. ఈ కమిటీకి రూ.1.44కోట్లు టార్గెట్ కాగా..1.46కోట్లు వసూలు చేసింది. ఆ తరువాత స్థానంలో శింగనమల, తాడిపత్రి కమిటీలున్నాయి. వీటి తరువాత అనంతపురం, గుత్తి , గుంతకల్లు, కళ్యాణదుర్గం కమిటీలున్నాయి. చివరి రెండు స్థానాల్లో ఉరవకొండ, రాప్తాడు కమిటీలున్నాయి. రాప్తాడు మార్కెట్ కమిటీ గత ఏడాది లక్ష్యం పూర్తి చేయడంలో పోటీ పడ్డా ఈఏడాది మాత్రం చతికిలపడింది. ఆ కమిటికీ రూ.53లక్షలు టార్గెట్ కాగా రూ.20.73లక్షలు మాత్రమే వసూలు చేశారు. గత ఏడాది ఫిబ్రవరి నాటికి రూ.41లక్షలు వసూలు చేసినట్లు సంబంధిత అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఉరవకొండ పరిస్థితి ఇలానే ఉంది. రూ.90లక్షలకు గాను..51.27లక్షల వసూలు మాత్రమే రాబట్టారు. గత ఆర్థిక సంవత్సరం(2023-24), ఈ ఆర్థిక సంవత్సరంలో ఈ కమిటీ లక్ష్యం రూ.10లక్షలకుపైగా వెనుకబడి ఉండటం గమనార్హం.

మార్కెట్ కమిటీల వారిగా లక్ష్యాల వివరాలు ఇలా..

మార్కెట్ కమిటీ	లక్ష్యం రూపాయల్లో..	ఫిబ్రవరి ఆఖరుకు వసూలైంది (రూపాయల్లో..)
అనంతపురం	4.60కోట్లు	3.86కోట్లు
గుత్తి	29లక్షలు	23.92లక్షలు
గుంతకల్లు	65లక్షలు	50.47లక్షలు
కళ్యాణదుర్గం	61లక్షలు	43.24లక్షలు
రాప్తాడు	53లక్షలు	20.73లక్షలు
రాయదుర్గం	1.44కోటు	1.46కోట్లు
శింగనమల	1.02కోట్లు	92.86లక్షలు
తాడిపత్రి	2.02కోట్లు	1.81కోట్లు
ఉరవకొండ	90లక్షలు	51.27లక్షలు
మొత్తం	12.06కోట్లు	9.97కోట్లు

85 శాతం పూర్తి చేశాం

నిర్దేశిత లక్ష్యంలో 85శాతం లక్ష్యాన్ని పూర్తి చేశాం. మిగిలిన టార్గెట్లు పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. ఈనెల ఆఖరి వరకు సమయం ఉంది. రాప్తాడు రైస్ మిల్లు బంద్ కావడంతో టార్గెట్ పరంగా వెనుకబడింది. ఇక ఉరవకొండ కమిటీ పరిధిలోను ఎండు మిర్చికి ధరలేకపోవడం కొంత వరకు కమిటీ లక్ష్యంపై పడింది. ఈనెల చివరిలోగా నిర్దేశిత లక్ష్యాలను పూర్తిచేస్తాం.

- సత్యనారాయణ చౌదరి, ఏడీ, మార్కెటింగ్ శాఖ

ఉపాధి మెరుగుపరచడమే ధ్యేయం

● దివ్యాంగులకు త్వరలోనే వడ్డీ రహిత రుణాలు

● ఐడియా స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పంకజ్

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి10(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల జీవనోపాధులు మెరుగుపరచడమే ఐడియా(ఇన్‌క్లూజివ్ దివ్యాంగ్జ్ ఎంటర్‌ప్రెన్యూర్), సక్షం స్వచ్ఛంద సంస్థల ధ్యేయమని ఐడియా స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పంకజ్ అన్నారు. ఢిల్లీ నుంచి అనంతకు వచ్చిన సంస్థ ప్రతినిధులు వారం రోజులుగా దివ్యాంగుల వివరాలను సేకరిస్తున్నారు. ఇందుకు సంబంధించి సోమవారం ఆ సంస్థ కార్యాల యంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పంకజ్ మాట్లాడుతూ.. ఐడియా సంస్థ చైర్మన్ ఐతా మల్లికార్జున అనంత జిల్లాలో విద్యనభ్యసించి ప్రొఫెసర్‌గా సేవలందించారన్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన ఢిల్లీలో ఐడియా స్వచ్ఛంద సంస్థను స్థాపించి దివ్యాంగులకు సహాయసహకారాలు అందిస్తున్నారన్నారు. అందులో భాగంగానే ఉమ్మడి జిల్లాలో ఉన్న దివ్యాంగులకు జీవనోపాధి కలిగించాలనే ఉద్దేశ్యంతో వడ్డీ రహిత రుణాలు (రీఫండబుల్ సీడ్ మనీ) అందించేందుకు శ్రీకారం చుట్టారన్నారు. సర్వేలో భాగంగా ఉమ్మడి అనంత జిల్లా నుంచి దాదాపు 39 మంది దివ్యాంగులు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారన్నారు. ఈనెల 12 నుంచి 15వ తేదీ వరకూ కొవ్వూరునగర్‌లోని విద్యారణ్య స్కూల్‌లో శిక్షణ ఇస్తామన్నారు. 15వ తేదీ శిక్షణ పొందిన వారికి ఈడీపీ సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. అనంతరం 15 రోజుల్లోపు ఎంపికైన దివ్యాంగులందరికి ఒక్కొక్కరికి రూ.22500 రుణాన్ని వారి బ్యాంకు ఖాతాలకు జమ చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సక్షం స్వచ్ఛంద సంస్థ జిల్లా అధ్యక్షుడు సుంకు వేణుగోపాల్, ఐడియా ఈడీపీ ట్రైనర్ వీరం మురళీధర్ రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐడియా స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పంకజ్

వర్షపు నీటిని ఒడిసి పట్టుకోండి

● కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్

అనంతపురం టౌన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాల పెంపు కోసం వర్షపు నీటిని ఒడిసి పట్టుకోవాలని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ సూచించారు. కరువు ప్రాంతాలలో భూగర్భ జలాల పరిస్థితులపై కలెక్టర్లతో సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షపు నీటిని నిల్వ చేయడంద్వారానే భూగర్భ జలాలు పెరగడానికి అవకాశం ఉంటుందని, కలెక్టర్లు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. జిల్లాలో భూగర్భ జలాలపెంపునకు తీసుకుంటున్న చర్యల గురించి కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ కేంద్రమంత్రికి వివరించారు.

22న జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు

అనంతపురం విద్య, మార్చి 10(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశాలను ఈ నెల 22న నిర్వహిస్తామని జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి సోమవారం తెలిపారు. జడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు ఆర్థిక, ప్రణాళిక, వర్కులు, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యం స్టాండింగ్ కమిటీ సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. అదనపు సమావేశ మందిరంలో మహిళా, శిశు సంక్షేమం, వ్యవసాయం, సాంఘిక సంక్షేమం స్టాండింగ్ కమిటీ సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. స్టాండింగ్ కమిటీల అధ్యక్షులు, సభ్యులు హాజరుకావాలని కోరారు.

ఫేజ్-2 కెనాల్‌కు ఔట్‌ఫ్లో నిలుపుదల

బెళుగుప్ప, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయరు నుంచి హంద్రీనీవా ఫేజ్-2 కెనాల్‌కు ఔట్‌ఫ్లో నిలిపివేసినట్లు హంద్రీనీవా అధికారులు సోమవారం తెలిపారు. రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో 294 క్యూసెక్కులు వస్తుండగా, ప్రస్తుతం 1.521 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

చీనీ టన్ను రూ.21వేలు

అనంతపురం రూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.21,500 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవింద తెలిపారు. కనిష్ఠంగా రూ.4,350లు, సరాసరి రూ.12వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు.

ఈ-పంటలో ఉందా..?

● మీ పంట వివరాలు చూసుకోండి

● రైతుసేవా కేంద్రాల్లో వివరాలు

అనంతపురం అర్బన్/ధర్మవరం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): విపత్తులు సంభవించినప్పుడు రైతులకు పంటల బీమా, పంట నష్ట పరిహారం సక్రమంగా అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రబీ ఈ-పంట నమోదు వివరాలను రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శిస్తోంది. తద్వారా జాబితాలో పేరు లేకపోయినా, తప్పులు ఉన్నా సరిచేసుకునే వెసులుబాటు కల్పిస్తోంది. ఈ నెల 15వ తేదీ వరకూ జాబితా ప్రదర్శన ఉంటుంది. 20వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరిస్తారు. తహసీల్దారు, వ్యవసాయశాఖ అధికారి ఆమోదించిన తుది జాబితాను ఈ నెల 22న రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శిస్తారు.

ఆర్ఎస్కేల్లో వివరాలు

సామాజిక తనిఖీ కోసం రైతు సేవా కేంద్రాల్లో రబీ ఈ-పంట నమోదు వివరాలను ప్రదర్శనకు ఉంచామని అనంతపురం జేడీఏ ఉమామహేశ్వరమ్మ, శ్రీసత్యసాయి జిల్లా జేడీఏ సుబ్బారావు సోమవారం తెలిపారు. ఈ నెల 15వతేదీ దాకా వివరాలను ప్రదర్శిస్తామని తెలిపారు. గ్రామ సభలు ఏర్పాటు చేసి, ఈ-పంటలో వివరాలు చదివి వినిపిస్తామని తెలిపారు. అభ్యంతరాలుంటే రాత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతపురం జిల్లాలో 2024-25 రబీ సీజన్‌లో 83,451 హెక్టార్ల విస్తీర్ణాన్ని ఈ-పంట నమోదు చేశామని ఉమామహేశ్వరమ్మ తెలిపారు. మొత్తం 54,554 మంది రైతులకుగాను 51,716 మంది రైతుల ఈకేవైసీ (95 శాతం) పూర్తి అయిందన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

గుంతకల్లు టౌన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి సోమవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర తెలిపారు. మృతుడి మెడలో జంధ్యం ఉందని, వయసు సుమారు 30 ఏళ్లు ఉంటుందని తెలిపారు. అతన్ని గుర్తించేందుకు ఎలాంటి ఆధారాలు లభించలేదని అన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పెట్రోల్ బంకు పేరుతో టోకరా..!

● రూ.61.50 లక్షలు కాజేసిన వైనం

● ఉద్యోగాలిప్పిస్తానని మరో రూ.20లక్షలు

● లోకేశ్, ఎమ్మెల్యేల పేరుతో బెదిరింపులు

● ఎస్పీకి దళితుల ఫిర్యాదు

అనంతపురం క్రైం,మార్చి 10(ఆంధ్రజ్యోతి): మీ భూమిలో పెట్రోలు బంకు పెడితే అద్భుతమైన లాభాలొస్తాయని నమ్మించి రూ.61.50లక్షలు టోకరా కొట్టాడు. పిల్లలకు ఉద్యోగాలిప్పిస్తామని చెప్పి మరో రూ.20లక్షలు తీసేసుకున్నాడు. పెట్రోల్ పంపూ లేదు... పిల్లకు ఉద్యోగాలూ లేవు. నాలుగేళ్ల నుంచి ఇలా కథలు చెప్పుకుంటూ వస్తుంటే...నిలదీశారు. కానీ అతడు డబ్బు ఇవ్వలేదు. తనకు టీడీపీ నేతలు తెలుసని, ఏం చేసుకుంటారో చేసుకోండంటూ బెదిరిస్తున్నాడు. ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన పెద్దసద్దానప్ప, చిన్న సద్దానప్ప, వన్నూరమ్మ ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరితో కలిసి సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీ జగదీష్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం బాధితులు విలేకరులతో తమ గోడు వెళ్లబోసుకున్నారు. దళితులైన తమకు ఆశ చూపి, ఐదెకరాల భూమిలో పెట్రోల్ పంపు ఏర్పాటు చేయిస్తామని చెప్పి అనంతపురానికి చెందిన పడమల నాగేంద్ర అనే వ్యక్తి నమ్మించి రూ.61.50 లక్షలు తీసుకున్నాడని ఆరోపించారు. ఫేక్ ఫర్మ్‌తో...పెట్రోల్ ట్యాంకులు, పెట్రోల్ పంప్ చేసే యంత్రాలను చూపించి డబ్బు విడతల వారిగా వసూలు చేశాడని వాపోయారు. తమ పిల్లలకు ఉద్యోగాలిప్పిస్తామని ముగ్గురి నుంచి మరో రూ.21లక్షలు తీసుకున్నాడని వివరించారు. 2021లో ఈ డబ్బు తీసుకున్నాడని తెలిపారు. డబ్బు ఇవ్వమని అడిగితే... చంపడానికి ప్రయత్నించామని తమపైనే నాగేంద్ర అనంతపురం నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయించారని వాపోయారు. మానవ హక్కుల సంఘం పేరుతో భయపెడుతున్నాడని తెలిపారు. తనకు మంత్రి నారా లోకేశ్, టీడీపీ ఎమ్మెల్యేలు తెలుసని భయపెడుతున్నాడని ఆరోపించారు. నాగేంద్ర కొడుకు కూడా నేతల పేర్లు చెప్పి భయపెడుతున్నాడని తెలిపారు.

ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా దిక్కులేదా..?

● బాధితురాలి ఆవేదన

నార్పల మండల కేంద్రంలోని ఉద్దిబావి చేను వీధికి చెందిన తమ ఇంట్లో గత ఏడాది ఆగస్టు 25న దొంగతనం జరిగిందని... ఎస్పీ కార్యాలయంలో నాలుగుసార్లు, నార్పల పోలీస్‌స్టేషన్‌లో పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధిత మహిళ సునీత ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఎస్పీ జగదీష్‌ను కలిసి ఆమె ఫిర్యాదు చేశారు. తమ ఇంట్లో ఏడు తులాల బంగారం, 15 తులాల వెండి చోరీ జరిగిందని ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశామని తెలిపారు. నార్పల పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారని, దొంగలను వెతికే పనిలో ఉన్నామని చెప్పారని.. అర అంగులం కూడా ముందుకెళ్లలేదని వాపోయారు. దొంగతనం అనంతరం పోలీసులు డాగ్‌స్క్వాడ్‌ను పిలిపించారని, అది అయ్యప్ప సప్లయర్స్ షాపు వరకు వెళ్లిందని, అక్కడ ఏం విచారణ జరిగిందో తెలియదన్నారు. పోలీస్ సిబ్బంది ఫింగర్ ప్రింట్స్ తీసుకున్నారని, కానీ ఏం విచారించారో తెలియదన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న దళితులు

ఆకట్టుకున్న గురవయ్యల నృత్యం



పాలు తాగే కార్యక్రమంలో గురవయ్యలు

ఉరవకొండ,మార్చి10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గవిమఠంలో వెలిసిన చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం సాయంత్రం ఆలుమత కురుబ కులస్తుల ఆధ్వర్యంలో గురవయ్యలకు పాలు తాపే కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉత్తరాధికారి కరిబసవ రాజేంద్రస్వామి ప్రారంభించారు. గురవయ్యలు సంప్రదాయ వేషధారణతో చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం అనాదిగా వస్తున్న సంప్రదాయం ప్రకారం శివుడికి పూజలు నిర్వహించిన అనంతరం ప్రత్యేక పాత్రల్లో పోసిన పాలను గురవయ్యలు తాగగా, వారి పాదాలకు నమస్కరించి భక్తులు ఆశీర్వచనాలు పొందారు. కార్యక్రమంలో గవిమఠం సహాయ కమిషనర్ రాణి, కురుబ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజహంస శ్రీనివాసులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కే.రాజేష్, కురుబ సంఘం నాయకులు చేజాల నాగరాజు, లాలెప్ప, గూలెప్ప తదితరులు పాల్గొన్నారు.

అనంత నుంచి పాకిస్తాన్ సరిహద్దు దాకా..

● జై జవాన్, జై కిసాన్ నినాదంతో అనంత యువకుడి పాదయాత్ర



పాదయాత్ర చేసిన ప్రదీప్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): జై జవాన్... జై కిసాన్ నినాదంతో అనంతపురం నగరానికి చెందిన యువకుడు ప్రదీప్‌కుమార్ అనంత నుంచి పాకిస్తాన్ సరిహద్దు దాకా పాదయాత్ర చేశాడు. ఈ ఏడాది జనవరిలో పాదయాత్ర ఆరంభించి, రాష్ట్రంలోని పలు జిల్లాలమీదుగా పాకిస్తాన్ సరిహద్దు వరకు 2300 కిలో మీటర్లు పాదయాత్ర చేశాడు. ఈనెల ఐదో తేదీతో పాదయాత్రను పూర్తి చేసుకొని, తిరిగి అనంతకు చేరుకున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం స్థానిక ఎంజీ కాలనీలో ఈడిగ సంఘం నాయకులు, ఈడిగ కులస్తులు వేణుగోపాల్ గౌడ్, నారాయణస్వామి, లక్ష్మీనారాయణ, గంగాధర్, రవి, గోపాల్ తదితరులు ప్రదీప్‌కుమార్‌కు శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆదినారాయణ, శివకుమార్, జగదీష్, అరుణ్, పవన్‌కుమార్, తరుణ్, కుమార్, నాగేంద్ర, ప్రకాష్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

ధర్మవరం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో ఈనెల 12న నిరుద్యోగ యువతకు జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్‌బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరికృష్ణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేళాలో 5 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారున్నారు. పది, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ పూర్తి చేసి, 18 నుంచి 33 సంవత్సరాలలోపు వయసున్న వారు అర్హులన్నారు. ఈ జాబ్‌మేళాకు ఎంపికైన వారికి జీతం నెలకు రూ.13వేలు నుంచి రూ.20 వేలు ఇస్తారని పేర్కొన్నారు. హైదరాబాద్, పెనుకొండ, పాలసముద్రంలో ఉద్యోగం చేయాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులు బయోడేటాతోపాటు ఆధార్‌కార్డు, విద్యార్హత పత్రాలు తీసుకుని ఉదయం9 గంటలకు హాజరు కావాలన్నారు. వివరాలకు 9182288465 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

లోకేశ్‌కు ఘన స్వాగతం

అభిమానం చాటుకున్న కార్యకర్తలు



మంత్రి నారా లోకేశ్‌కు గజమాలతో స్వాగతం పలుకుతున్న అభిమానులు

పుట్టపర్తి రూరల్/కదిరి అర్బన్/ముదిగుబ్బ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఖాద్రీ నారసింహుడికి పట్టు వస్త్రాలను సమర్పించేందుకు వచ్చిన మంత్రి నారా లోకేశ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు పుట్టపర్తిలోని సత్యసాయి విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. విజయవాడ నుంచి పుట్టపర్తికి వారు ప్రత్యేక విమానంలో సోమవారం సాయంత్రం 5.32 గంటకు చేరుకున్నారు. హిందూపురం ఎంపీ పార్థసారథి, కదిరి ఎమ్మెల్యే కందికుంటప్రసాద్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ వీరత్న, ఆర్డీఓ సువర్ణ, టీడీపీ ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ కోవెలమూడి రవీంద్ర, టీడీపీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ బీవీ వెంకట్రాముడు, ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, బీజేపీ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, అనంతపురం జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, రాష్ట్ర మైనారిటీ విభాగం కార్యదర్శి మహమ్మద్‌రఫీ, రాష్ట్ర వడ్డెర సాధికారత కమిటీ కో ఆర్డినేటర్ వెంకట్, రాష్ట్రమాదిగ కార్పొరేషన్ డైరక్టర్ బేకరి గంగాధర్, టీడీపీ హిందూపురం కో ఆర్డినేటర్ శ్రీనివాసులు, పురం మున్సిపల్ చైర్మన్ రమేష్, జిల్లా బోయసాధికార కమిటీ అధ్యక్షుడు రామాంజినేయులు, టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మాజీ మునిసిపల్ చైర్మన్లు పీసీ గంగన్న, బెస్త చలపతి, నాయకులు ఆలం నరసాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, చమన్ తనయుడు ఉమర్ ముక్తియార్, స్థానిక నాయకులు రత్నప్పచౌదరి, సాలక్కగారి శ్రీనివాసులు, కన్వీనర్లు శ్రీనివాసులు, రామకృష్ణ, గోపాల్‌రెడ్డి, జయచంద్ర, మల్లిరెడ్డి, మైలే శంకర్ స్వాగతం పలికారు. కదిరి నియోజకవర్గంలోని పట్నం వద్ద నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. పెద్దఎత్తున బాణసంచా పేల్చి, పూలమాలలు వేశారు. కుటాగుళ్ల వద్ద గజమాలతో స్వాగతం పలికారు.

● మలకవేముల క్రాస్‌లో..

రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్‌కు ముదిగుబ్బ మండల పరిధిలోని మలకవేముల క్రాస్‌లో అభిమానులు ఘనస్వాగతం పలికారు. నారా లోకేశ్ పుట్టపర్తి నుంచి రోడ్డు మార్గాన ముదిగుబ్బ మీదుగా కదిరిలో జరిగే ఖాద్రి లక్ష్మీనరసింహ స్వామి కల్యాణంలో పాల్గొనడానికి బయలుదేరారు. మలకవేముల క్రాస్‌కు ఆయన సోమవారం రాత్రి 7.30 గంటలకు చేరుకున్నారు. ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, భారీ సంఖ్యలో అభిమానులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం కదిరి ఖాద్రీలక్ష్మీ నరసింహ స్వామి బ్రహోత్సవాల్లో భాగంగా స్వామి అమ్మవార్లకు నిర్వహించిన కల్యాణోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. కాగా, మంత్రికి పుట్టపర్తి ఎయిర్‌పోర్ట్‌లో జిల్లా ప్రముఖ నాయకులు, అధికారులు స్వాగతం పలికారు.

● ముదిగుబ్బ ఎంపీపీపై ఫిర్యాదు

ముదిగుబ్బ ఎంపీపీ గొడ్డుమర్రి ఆదినారాయణ యాదవ్‌పై మంత్రి నారా లోకేష్‌కు అడవి బ్రాహ్మణపల్లి తండా గిరిజనులు ఫిర్యాదు చేశారు. ముదిగుబ్బ మండలం పొడరాళ్ళపల్లి వద్ద మంత్రిని అడవి బ్రాహ్మణపల్లి తండా గిరిజనులు కలిశారు. ఆదినారాయణ యాదవ్ తమ భూములను ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నాడని అడవి బ్రాహ్మణపల్లికి చెందిన గిరిజన మహిళలు, రైతులు ఆధారాలతో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఫిర్యాదులు తన దృష్టికి వచ్చాయని, వాటిపై తప్పకుండా జిల్లా అధికారులతో విచారణ చేయించి, అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని నారా లోకేష్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.



ఎయిర్‌పోర్ట్‌లో మంత్రి నారా లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న ఎస్పీ రత్న, టీడీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, ఉమ్మడి జిల్లా టీడీపీ కో-ఆర్డినేటర్ కోవెలమూడి రవీంద్ర



మలకవేముల క్రాస్‌లో లోకేశ్‌కు స్వాగతం పలికేందుకు వేచిఉన్న పరిటాల శ్రీరామ్



ఎంపీ పార్థసారథి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, టీడీపీ నేత సామకోటి ఆదినారాయణ, బీజేపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి

న్యూస్ బాక్స్

ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలు నిర్మించండి

శాసనసభలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి



పుట్టపర్తి రూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే మాట్లాడారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు సత్యసాయి బాబా ట్రస్టు భవనాల్లో కొనసాగుతున్నాయన్నారు. ప్రభుత్వం సాధ్యమైనంత త్వరగా కలెక్టరేట్‌తో పాటు 52 శాఖల కార్యాలయాలను నిర్మించి వాటికి సిబ్బంది నియమించడంతోపాటు సదుపాయాలు కల్పించాలని కోరారు.

ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ

పుట్టపర్తిరూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ వి. రత్న సోమవారం మొత్తం 55 ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన ఫిర్యాదుదారులతో ఎస్పీ మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో మహిళా డీఎస్పీ ఆదినారాయణ, లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

హరీష్.. నీస్థాయి తెలుసుకో..

పుట్టపర్తిటౌన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణను ధర్మవరం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి హరీష్ కుమార్ విమర్శించడం తగదని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ తెలిపారు. సోమవారం పుట్టపర్తిలోని సాయిఆరామం ఫంక్షన్ హాల్‌లో ఆయన మాట్లాడారు. అడవి బ్రాహ్మణపల్లి తండాలో భూములను ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ అనుచరులు ఆక్రమించారని, ఈ విషయాన్ని రామక్రిష్ణకు గిరిజనులు ఫిర్యాదు చేశారని, దీన్ని రెవెన్యూ శాఖమంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి తమ పార్టీ నాయకులు తీసుకెళ్లారని తెలిపారు. దీనిపై హరీష్‌కుమార్ విమర్శించడం సరికాదని, ఆయన స్థాయికి మించి విమర్శలు చేయడం మానుకోవాలని హితవుపలికారు.

విద్యాసామగ్రి పంపిణీ

గాండ్లపెంట, మార్చి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 120 మంది విద్యార్థులకు రూ.8వేల విలువైన అట్టలు, పెన్నులు సోమవారం పంపిణీ చేశారు. ఇందులో దాతలు రాష్ట్ర వాల్మీకి సేవా సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ అనంద్, కానిస్టేబుల్ భాస్కర్‌రాజు, హెచ్‌ఎం సిద్ధారెడ్డి పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

నంబులపూలకుంట, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కటకంవారిపల్లికిచెందిన భాస్కర్ గాండ్లపెంట మండలంలో ద్విచక్రవాహన ప్రమాదంలో గాయపడ్డారు. చికిత్స పొందుతూ మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్.. ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆ కుటుంబానికి పరిహారం అందేలా చర్యలు తీసుకున్నారు. పరిహారం కింద మంజూరైన రూ.7.90 లక్షల చెక్కును ఎమ్మెల్యే కదిరిలోని తన నివాసంలో భాస్కర్ భార్య రోజాకు సోమవారం అందించారు.

● పట్టాలు ఇప్పించండి

కదిరి: వైసీపీ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు పట్టాలు మంజూరు చేసిందని, అయితే వాటిని తమకు ఇవ్వకుండా భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు వారి వద్దే ఉంచుకున్నారని బాధితులు వాపోయారు. తమకు ఆ పట్టాలు అందేలా చర్యలు తీసుకోవాలని వారు ఎమ్మెల్యే కందికుంటకు సోమవారం వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే విచారణ చేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సోముశేఖర్, మహమ్మద్‌రఫీ, అలీ, ఖాదర్‌బాషా, హరిక్రిష్ణ, బాబ్‌జాన్ పాల్గొన్నారు.

వర్మీకంపోస్టు ఎరువులతో ఆరోగ్యం

పుట్టపర్తిటౌన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): వర్మీ కంపోస్టు ఎరువులు ఉపయోగించి పండించిన పంటలతో ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణంలో జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్గానిక్ వర్మీ కంపోస్టు స్టాల్స్‌ను పరిశీలించిన ఆయన మాట్లాడారు. వర్మీకంపోస్టు ఎరువుల తయారీకి ఔత్సాహికులు ముందుకు రావాలన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల గురించి విస్తృత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. స్టాల్స్ ఏర్పాటు చేసిన గోరంట్ల పంచాయతీ అధికారులు, సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సమత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంజీవనాయక్, వర్మీకంపోస్టు ఎరువు తయారీదారులు గణేష్, ఆదినారాయణ పాల్గొన్నారు.



ఆర్డీఓ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీల ధర్నా

సమస్యలపై అంగన్‌వాడీల ధర్నా

ధర్మవరం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. ముందుగా సీఐటీయూ కార్యాలయం నుంచి ర్యాలీగా ఆర్డీఓ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ ధర్నా చేపట్టారు. సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కో-కన్వీనర్ అయూబ్‌ఖాన్ మాట్లాడుతూ.. ధర్మవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ హెల్పర్ల సమస్యల పరిష్కారం కోసం అనేకసార్లు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చామని, అయినా సమస్యలు పరిష్కారం కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, మినీ వర్కర్లు మెయిన్ వర్కర్లుగా జీవోలు విడుదల చేయాలని కోరారు. అనంతరం వినతిపత్రాన్ని ఆర్డీఓ మహేశ్‌కు అందజేశారు. ఇందులో అంగన్‌వాడీలు చంద్రకళ, పోతక్క, దీన, సునీత, వేదవతి, గంగరత్న, చిట్టెమ్మ, సరస్వతి పాల్గొన్నారు.

మా భూములను మాకు ఇప్పించండి: రైతులు

ముదిగుబ్బ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్న తమ భూములను తిరిగి తమకు ఇప్పించాలని మండల పరిధిలోని అడవి బ్రాహ్మణపల్లి తండా గ్రామ రైతులు, మహిళలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సీపీఐ నాయకుల ఆధ్వర్యంలో ముదిగుబ్బ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. అనేక సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న తమ భూములను ఈ ప్రాంతానికి సంబంధం లేని ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ తమకు తెలియకుండా ఆయన పేరిట, ఆయన బంధువుల పేరిట ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకున్నారన్నారు. ఈ విషయాన్ని సీపీఐ రాష్ట్ర నాయకుడు రామకృష్ణ దృష్టికి తీసుకెళ్లామని, ఆయన రెవెన్యూ శాఖమంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా.. దీనిపై పూర్తిస్థాయిలో నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించాలన్నారు. అయితే అధికారులు రెండురోజుల పాటు తమ గ్రామంలో తూతూ మంత్రంగా విచారణ చేశారని, ఇంతవరకూ ఎంపీపీపై ఎలాంటి ఎలాంటి చర్యా తీసుకోలేదని మండిపడ్డారు. తహసీల్దార్ నారాయణస్వామితో తీవ్ర స్థాయిలో వాదించారు. గిరిజన రైతులకు ఆ భూములను ఇప్పించకపోతే త్వరలోనే ఉద్యమాలు చేపడతామని సీపీఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు హెచ్చరించారు. ఇందులో బాధిత గిరిజన రైతులు, సీపీఐ నాయకులు తిప్పయ్య, గంగిరెడ్డిపల్లి నాయుడు, లింగుట్ల వెంకటరాముడు, రాధాకృష్ణ, ముత్తులూరి మధు, అమిలినేని రామాంజి, కొండయ్య, బావయ్య పాల్గొన్నారు.

నాటుసారాను నిర్మూలిద్దాం

ధర్మవరం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): నాటుసారాను నిర్మూలిద్దాం-ప్రగతిని సాధిద్దామని ధర్మవరం ఎక్సైజ్ సీఐ చంద్రమణి తెలిపారు. స్థానిక కళాజ్యోతి సర్కిల్‌లో సోమవారం రాత్రి నాటుసారా నిర్మూలనపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాజాత బృందం నాటుసారా వల్ల కలిగే నష్టాలను పాటల ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ ఎస్ఐ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిష్కారం కాని సమస్య

నంబులపూలకుంట, మార్చి 10(ఆంధ్రజ్యోతి): గతంలో ఫిర్యాదు చేసుకున్నా మండల కేంద్రంలోని దోబీఘాట్ స్థల సమస్య పరిష్కారం కాలేదని రజక సంఘం నాయకులు వాపోయారు. మళ్లీ సోమవారం వారు తహసీల్దార్ దేవేంద్రనాయక్‌కు ఆ సమస్యపై వినతిపత్రం అందించారు. వీరికి మద్దతుగా టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జీ దండే రవిశంకర్ కూడా తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు.

ఇంటిపట్టాలు ఇవ్వాలి

నల్లమాడ : తమకు ఇంటిపట్టాలతో పాటు ఇళ్లు మంజూరు చేయకుమండల కేంద్రంలోని పేదలు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ రంగనాయకులుకు వినతి పత్రం అందచేశారు. జిల్లా కార్యదర్శి మల్లెల గంగాధర్ మాట్లాడుతూ.. పేదలను గుర్తించి సర్వేనెంబర్ 59లో ఇంటిపట్టాలు, ఇళ్లు నిర్మించాలని కోరారు. అలాగే పంచాయతీ కార్యాలయం వద్ద కమ్యూనిస్టు కాలనీలో నకిలీ పట్టాలపై చర్యలు తీసుకుని ఒర్జినల్ పట్టాలివ్వాలన్నారు. నల్లమాడ పాత హమాలీ క్వాటర్సు వద్ద ఉన్న చేనేత కాలనీలో చేనేత కార్మికులకు ఇచ్చిన పట్టాలు అమ్మకాలు జరిగాయని, వీటిపై విచారణ జరిపి, అర్హులైనవారికి ఇంటిపట్టాలు ఇవ్వాలన్నారు. మండల కేంద్రానికి శ్మశానవాటికకు పది ఎకరాల స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇందులో మండల కార్యదర్శి ఆర్. చంద్ర, ఆదినారాయణ, గంగయ్య, నాగభూషణ, కదిరప్ప, ఆర్పీపీ మహిళలు పాల్గొన్నారు.

● ఓబుళదేవరచెరువు: మండలంలోని వివిధ గ్రామాల్లోని పేదలకు ఇంటిపట్టాలు ఇచ్చి ఆదుకోవాలని సోమవారం తహసీల్దార్ అనంతాచారికి బీజేపీ మండల అధ్యక్షుడు వీరాంజి వినతి పత్రం అందజేశారు. ఎం.కొత్తపల్లి గ్రామ పొలం సర్వేనెంబర్ 216లో 2.71 ఎకరాల ప్రభుత్వ స్థలముందని, ఆ స్థలంలో నిరుపేదలకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు.

ఇరువర్గాలపై కేసు

ధర్మవరం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దుర్గానగర్‌కు చెందిన సాకే స్రవంతి అత్తింటివారు వేధింపులకు గురిచేస్తున్నారని టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన భర్త శ్రీనివాసులు, ఆయన తల్లి, ఆడపడచు, బావలు వేధిస్తున్నారని, ఇందులో భాగంగా భర్త శ్రీనివాసులు ఆదివారం కొడవలితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని ఆ ఫిర్యాదులో పేర్కొంది. అదేవిధంగా సాకే స్రవంతి బంధువులు శ్రీనివాసులు, ఆయన తల్లిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచారని వారి బంధువులు కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరువర్గాల వారిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



ఆసీఫ్, రాజు, సాజియా

ధర్మవరం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు రైల్వే క్రీడామైదానంలో శనివారం జరిగిన ఉమ్మడి అనంతపురం జిల్లా కబడ్డీ పోటీల్లో ధర్మవరానికి చెందిన క్రీడాకారులు ఆసీఫ్, రాజు, సాజియా ఎంపికైనట్టు కోచ్ పృథ్వీ సోమవారం తెలిపారు. వీరు ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు పులివెందులలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారన్నారు.

వేధింపుల నుంచి కాపాడండి

జేసీకి సచివాలయ ఉద్యోగుల వినతి

పుట్టపర్తిటౌన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): కులసంఘాలు, రాజకీయ నాయకుల వేధింపుల నుంచి సచివాలయ, పంచాయతీ ఉద్యోగులను కాపాడాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు సంఘం నాయకులు సోమవారం వినతిపత్రం అదించారు. కలెక్టర్ కార్యాలయంలో పంచాయతీ సంఘం నాయకులు పభ్రాకర్, ఓంప్రసాద్, నరేష్, సురేంద్రరెడ్డి తదితరులు మాట్లాడారు. ఇటీవల పుట్టపర్తి మండలంలోని పెడబల్లి పంచాయతీ కార్యదర్శి గోపాల్‌రెడ్డి, సిబ్బందిపై అక్రమంగా ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేశారని వాపోయారు. నిబంధనల మేరకు వ్యవహరించిన అధికారులు, సిబ్బందిపై కులసంఘాల నాయకుల దౌర్జన్యాలు మితిమీరుతున్నాయన్నారు. అక్రమ కేసుల నుంచి సచివాలయ ఉద్యోగులను కాపాడాలని, ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తే ఉద్యోగులకు రక్షణ కల్పించాలని కోరారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగులను వేధించే వారిపై కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పాడి ఎక్కించారు..!



వైసీపీ పాలనలో పాడి రైతులకు దక్కని పశువుల బీమా

- టీడీపీ హయాంలో అమలు
- పూర్తిగా నిర్లక్ష్యం చేసిన వైసీపీ
- తీవ్రంగా నష్టపోయిన రైతులు
- ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్న వైనం
- చేయూతకు కూటమి ప్రభుత్వం చర్యలు
- అవగాహన కల్పించకుండా అధికారుల నిర్లక్ష్యం

ధర్మవరంరూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యవసాయం తర్వాత ఎక్కువ మంది రైతులు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. రైతులు జీవనాధారం కోసం వేలకు వేలు వెచ్చించి పాడి ఆవులను కొనుగోలు చేసి పాలతో జీవనాన్ని కొనసాగిస్తున్నారు. పాడి ఆవులు వివిధ ప్రాంతాల నుంచి కొనుగోలు చేసిన ఆవులు వాతారణ మార్పులు, వివిధ రకాల అనారోగ్యాలతో మృత్యువాత పడేవి. అలాంటి పాడి రైతులను ఆదుకోవడానికి గతంలో టీడీపీ ప్రభుత్వం పశువులకూ బీమా సౌకర్యం కల్పించింది. పశువులు చనిపోతే.. నష్టపరిహారం చెల్లించి.. రైతులను ఆదుకునేది. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ పథకాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. వేలాది మంది పాడి రైతులు తమ పశువులు చనిపోవడంతో పరిహారం కోసం ఐదేళ్లుగా నిరీక్షించి.. ఆశలు వదిలేసుకున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో.. ఈ పథకాన్ని తిరిగి అమలు చేసి.. పాడి రైతులను ఆదుకునేలా చర్యలు చేపట్టింది.

● రూ.వేలకు వేలు వెచ్చించి..

ప్రస్తుతం మార్కెట్‌లోనే కాక రైతుల వద్ద కూడా పాడి ఆవు ధరలు రూ.40వేలు నుంచి రూ. 50వేల వరకు పలుకుతున్నాయి. అంతటి భారీ మొత్తంతో కొనుగోలు చేసిన పశువులు మరణిస్తే.. బీమా సౌకర్యం ఉండటంతో గత టీడీపీ హయాంలో వారంలోపే పరిహారం అందేది. అయితే వైసీపీ హయాంలో బీమా తీసుకున్నా... పరిహారం అందక పాడి రైతులు సంవత్సరాల తరబడి నిరీక్షించారు. వైసీపీ నిర్లక్ష్యం వల్ల పాడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. అప్పట్లో మరణించిన పాడిఆవులకు నష్టపరిహారం కోసం ఇప్పటికి రైతులు ఎదురుచూస్తూనే ఉన్నారు.

● కూటమి చర్యలు :

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. పాడిరైతులను ఆదుకునేలా మళ్లీ చర్యలకు శ్రీకారం చుట్టింది. పాడి పశువులకు బీమా పథకానికి మార్గదర్శకాలు విడుదల చేసింది. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, దారిద్రరేఖకు దిగువన ఉన్న కుటుంబాలు, రేషన్‌కార్డు కలిగి ఉన్న రైతుకుటుంబాలకు ఈ బీమా సౌకర్యం కల్పించనుంది. ఈ బీమా సౌకర్యం కోసం ఆయా గ్రామసచివాలయాల పశుసంవర్థక శాఖ సహాయకులను సంప్రదిస్తే చాలు. వారు వచ్చి పాడి పశువుల ఆరోగ్యాన్ని పరీక్షించి బీమా చేస్తారు. ఇందులో రైతు వాటాగా నిర్ధారించి బీమా సౌకర్యం కల్పించనున్నారు. అనారోగ్యాల బారిన పడి మృతిచెందిన, ప్రమాదవశాత్తు మృతిచెందిన పాడిఆవులు, గొర్రెలు, మేకలకు, ముర్రెగెదేలకు ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పించింది. ఒకసారి బీమా చేయించుకుంటే మూడు సంవత్సరాల వరకు అది వర్తిస్తుందని పశువైద్యాధికారులు తెలిపారు. బీమా చేసేటప్పుడు పశువుకు చెవిపోగు వేయించి బీమాల నమోదు చేయించుకోవాలని సూచించారు.

కూటమి ప్రభుత్వం కొత్తగా విడుదల చేసిన పశువుల బీమా వివరాలు..

పశువు బీమా	ప్రీమియం	ప్రభుత్వ సబ్సిడీ	రైతు వాటా
రూ.15000	రూ.960	రూ.768	రూ.199
రూ.30000	రూ.1920	రూ. 1536	రూ.398
రూ.35000	రూ.2240	రూ.1536	రూ.729
రూ.40000	రూ.2560	రూ.1536	రూ.1060
రూ.45000	రూ.2580	రూ.1536	రూ.1392
రూ.50000	రూ.3200	రూ.1536	రూ.1723

● అవగాహన ఏదీ..?

కూటమి ప్రభుత్వం పశువుల బీమా ప్రవేశపెట్టినా.. అందుకు సంబంధించిన వివరాలపై పాడిరైతులకు అవగాహన కల్పించడంలో గ్రామపశువైద్య అధికారులు పూర్తిగా విఫలం అవుతున్నారనే విమర్శలున్నాయి. ఇప్పటివరకు గ్రామాల్లో చాలామంది రైతులకు పశువులకు బీమా ఉందనే విషయమే తెలీదు. ఇప్పటికైనా పశువుల బీమాపై పాడి రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

రూ.50వేలు నష్టపోయా



కొన్ని నెలల క్రితమే పాడి ఆవును రూ.50వేలు వెచ్చించి కొనుగోలు చేశా. ఇంటికి వచ్చిన వారానికే అనారోగ్యంతో ఆ పాడి ఆవు మృతి చెందింది. బీమా లేకపోవడంతో నష్టపోయా. బీమా చేయించి ఉంటే నేడు నాకు పరిహారం అందేది. పాడి రైతులకు ఈ పథకంపై అవగాహన కల్పించేలా కృషి చేయాలి.

-యోగేష్, చిగిచెర్ల

అవగాహన లేక..



నేను పాడి రైతును. అప్పులు చేసి ఆవులను పెట్టుకుని జీవనం సాగిస్తున్నా. కొన్ని నెలల క్రితం 10 లీటర్ల ఇచ్చే ఆవు అనారోగ్యంతో మృతిచెందింది. రూ.45 వేలు నష్టపోయాను. పశువుల బీమా గురించి నాకు తెలీదు. అధికారులు ఎన్నడూ దీని గురించి చెప్పలేదు. బీమా చేసి ఉంటే.. నాకు నష్టపరిహారం అందేది. ఈ ప్రభుత్వమైనా పశువుల బీమాపై అవగాహన కల్పించేలా.. నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలి.

-రంగయ్య, వెంకటతిమ్మాపురం

బీమా చేయించుకోవాలి

ప్రస్తుతం ప్రభుత్వం పశు బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. పాడిరైతులు తమ పశువులకు బీమా చేయించుకోవాలి. మీ గ్రామ సచివాలయాల్లోని పశువైద్యసహాయకులను కలిసి తమ పశువులను చూపించి వాటికి బీమా చేయించుకోవాలి. ఇందులో రైతువాటాతో కలిపి చెల్లించాలి. పశువులకు చెవిపోగుల ద్వారా ఐడీ నెంబర్ వేస్తారు. ఒకసారి బీమాచేస్తే 3సంవత్సరాల వరకు వర్తిస్తుంది.

-శేఖర్, మండల పశువైద్యాధికారి, చింతలపల్లి

న్యూస్ బాక్స్

ఉపాధి కూలీలకు బిల్లులు చెల్లించాలి


పనుల వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధి కూలీలు

పెనుకొండ రూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న డిమాండ్ చేశారు. సోమవారం రొద్దం మండలం తురకలాపట్నం గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కూలీలతో సమావేశమై సమస్యలపై ఆరాతీశారు. వారు మాట్లాడుతూ ఎనిమిది వారాల నుంచి పనిచేస్తున్నా బిల్లులు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండాకాలంలో పనిముట్లు ఇవ్వలేదని పనిదినాల పెంపు, రోజు కూలి రూ.600, మేట్‌లకు రూ.5చొప్పున పారితోషికం ఇవ్వాలన్నారు. 12న విజయవాడలో జరిగే మహాధర్నాకు కూలీలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. నాయకులు నారాయణ, ఉపాధికూలీలు పాల్గొన్నారు.

సమస్యలు త్వరితగతిన పరిష్కరించండి


తహసీల్దార్‌తో సమస్యలపై చర్చిస్తున్న టీడీపీ నాయకులు

హిందూపురం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయానికి శ్రీనివాసరావుతోపాటు మండల కన్వీనర్ అశ్వర్థరెడ్డి, ఇతర నాయకులు వెళ్లారు. కార్యాలయంలో 3గంటలపాటు రెవెన్యూ సమస్యలపై చర్చించారు. ఏదైనా సమస్య వస్తే వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ బేవనహళ్లి ఆనంద్, అరుణాచలరెడ్డి, మాజీ జడ్పీటీసీ ఆదినారాయణ, సర్పంచ్ మంజునాథ్, రాము, ఉమాశంకర్‌రెడ్డి, హనుమంతు, రామక్రిష్ణారెడ్డి, శంకరప్ప, గోపాల్‌రెడ్డి, అంజినరెడ్డి పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో గుట్టూరు విద్యార్థిని ప్రతిభ



బహుమతి అందుకుంటున్న మౌనిక

పెనుకొండ రూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): వదాన్య జన సొసైటీ ఆధ్వర్యంలో డిసెంబరులో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ చాటిన గుట్టూరు విద్యార్థిని మౌనికకు బహుమతి ప్రశంసాపత్రం అందించినట్లు హెచ్ఎం నాగార్జునుడు తెలిపారు. 9, 10 తరగతులకు జిల్లాస్థాయిలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో మౌనిక మండల టాపర్‌గా నిలిచిందన్నారు. వదాన్య జనసొసైటీ సంస్థవారు రూ.4వేలు నగదు బహుమతి, ప్రశంసాపత్రం, మెమెంటో అందించారు.

మహిళా చైతన్యమూర్తి సావిత్రీబాయి పూలే


సావిత్రీబాయి పూలే చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న టీచర్లు

మడకశిర రూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మహిళా చైతన్యమూర్తి సావిత్రిబాయి పూలే అని హెచ్ఎం భూతన్న అన్నారు. సోమవారం అన్ని పాఠశాలల్లో సావిత్రిబాయి పూలే వర్ధంతి నిర్వహించారు. జిల్లేడుగుంట ప్రాథమికోన్నత పాఠశాలలో ఆమె చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుడిబండ: స్థానిక ఎంజేపీ కళాశాలలో సోమవారం సావిత్రిబాయిపూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అధ్యాపకులు శివలింగప్ప, లలిత, అనూరాధ, దుర్గ, ప్రమీళ, పార్వతి, మంజుళ, అర్చన, శైలజ పాల్గొన్నారు.

మహిళలు సేవల్లో ముందుండాలి



మాట్లాడుతున్న గాయత్రీనారాయణ

హిందూపురం అర్బన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మహిళలు సేవా రంగంలో ముందుండాలని కర్ణాటక రాష్ట్రం మధుగిరికి చెందిన గాయత్రీ నారాయణ అన్నారు. స్థానిక పాండురంగ నగర్‌లో ప్రగతి లేడీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఆమే ముఖ్య అతిథిగా ఆమె హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ మహిళలు ఇప్పటికే పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో పోటీ పడుతున్నారన్నారు. అదే విధంగా పది మందికి ఉపయోగపడేలా సేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షురాలు తివేణి ప్రభు, కార్యదర్శి రాజేశ్వరీ కుమార్, కోశాధికారి లీలాకీర్తి పాల్గొన్నారు.

విద్యార్థినులకు అభినందనలు



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రినిపాల్

హిందూపురం అర్బన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీల్లో ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఇటీవల పోలీస్ అమరవీరుల దినోత్సవాలను పురస్కరించుకొని నిర్వహించిన పోటీల్లో విద్యార్థులకు ఎస్పీ రత్న చేతులమీదుగా బహుమతులు అందుకున్నారు. మదీహా, వైష్ణవి, నిఖితలను ప్రిన్సిపాల్ ప్రగతి, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశులు, సీనియర్ అసిస్టెంట్ నరసింహులు, రంగనాయకులు విద్యార్థులను అభినందించారు.

లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

● 13న స్వామివారి కల్యాణం, 14న బ్రహ్మరథోత్సవం


స్వామివారి మూలవిరాట్టు


రథాన్ని సిద్ధం చేస్తున్న గ్రామస్థులు

చిలమత్తూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెలసిన కనుమ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభమైనట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధానంగా స్వామి వారి బ్రహోత్సవాల్లో భాగంగా నిత్య పూజలు నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు, అర్చనలు, సాయంత్రం 6 గంటలకు స్వస్తి పుణ్యాహవచనం, అంకురార్పణ, కలశస్థాపన నిర్వహించినట్లు ఆలయ అర్చకులు తెలిపారు. 11న ఉదయం మోహినీ ఉత్సవం, 12న ధవనోత్సవం, దీపోత్సవం, హనుమంత వాహనోత్సవం, 13న స్వామి వారి కల్యాణం, సాయంత్రం 6 గంటలకు సహస్రదీపాలంకరణ, గరుడ వాహనోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 14న బ్రహ్మరథోత్సవం, 15న ముత్యాలపల్లకి, దోపుతిరునాళ్ల, 16న వసంతోత్సవం, ధ్వజావరోహణం, ఉయ్యాలోత్సవం, 17న శయనోత్సవం, పుష్పయాగోత్సవం, 18న సుప్రభాతసేవతో ఉత్సవాలు ముగుస్తాయి.

ఆకట్టుకునేలా బ్రహ్మరథోత్సవం: మండల ప్రజల ఆరాధ్యమైన కనుమ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మరథోత్సవం 14న నిర్వహించనున్నారు. 36 అడుగుల ఎత్తు కలిగిన రథంలో స్వామివారిని ప్రతిష్ఠింపజేసి ప్రధాన వీధుల గుండా ఊరేగిస్తారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనున్నారు.


కనుమ లక్ష్మీనరసింహస్వామి ఆలయం

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు

పావగడ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చే కనుమ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మరథోత్సవాలు బుధవారం నుంచి 16వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు జ్ఞానేష్‌బాబు, కార్యదర్శి మాధవన్ తెలిపారు. 14న మధ్యాహ్నం 12గంటలకు బ్రహ్మరథోత్సవం ఉంటుందన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు.

అంతా నా ఇష్టం..!

● రైల్వే స్టేషన్ ముందు బారికేడ్ల ఏర్పాటు
● చిన్న పిల్లలు, వృద్ధులకు ఇబ్బందులు
● సైకిల్ స్టాండ్ నిర్వహకుడి ఇష్టారాజ్యం


స్టేషన్ ముందు బారికేడ్లు ఏర్పాటు చేసిన దృశ్యం

హిందూపురం అర్బన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్, బస్టాండ్‌లు ప్రజలకు అనుకూలంగా ఉండేలా చూస్తారు. అవి ప్రభుత్వ స్థలాలు, అంటే ప్రజలకు పూర్తి హక్కు ఉంటుంది. అయితే హిందూపురం రైల్వేస్టేషన్‌లో ప్రైవేటు వ్యక్తుల హవా కొనసాగుతోంది. సైకిల్ స్టాండ్ నిర్వహకుడు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడు. స్టేషన్‌కు ఆమడదూరంలో బారికేడ్లు ఏర్పాటు చేసి ద్విచక్రవాహనాలు, ఆటోలు అక్కడే ఆపేస్తున్నాడు. దీంతో స్టేషన్‌కు వచ్చే చిన్నపిల్లలు, ముసలివారితో పాటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధిక లగేజీలతో వచ్చే వారు దూరం నుంచి లగేజీని తీసుకురాలేక అవస్థలు పడుతున్నారు. వాటితో పాటు చిన్నారులను చంకన వేసుకుని రావాలంటే, వృద్ధులను నడిపించలేక నరకం చూస్తున్నారు. ఇది ఒక సైకిల్ స్టాండ్ నిర్వహకుడి నిర్వాకమే. అక్కడ ఇలాంటి దౌర్జన్యం జరుగుతుంటే ఒక కేంద్ర ప్రభుత్వానికి చెందిన స్థలంలో ఎలా పడితే అలా వ్యవహరిస్తున్నా అక్కడే ఉన్న ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీలు, స్టేషన్ మాస్టర్ కాని నిలువరించలేదు. ఈ విషయం వారి దృష్టికి వెళ్ళిందా..? లేదా తెలిసి వారు నిర్వహకునికి వంత పాడుతున్నారా అని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాడు. ఇలాగే కొనసాగితే ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బారికేడ్లు తొలగించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

సైకిల్ స్టాండ్ వరకే అనుమతి
- రామచంద్ర, రైల్వే స్టేషన్ మాస్టర్

రైల్వేశాఖ ప్రకటనలో టెండర్‌లో సైకిల్ స్టాండ్ దక్కించుకున్న వారు సైకిల్ స్టాండ్ వరకు మాత్రమే వారికి అనుమతి. ఎలా పడితే అలా వ్యవహరించకూడదు. రోడ్డుకు అడ్డంగా ప్రజలకు, ప్రయాణికులకు ఇబ్బందులు కలిగేలా వ్యవహరిస్తే చర్యలు చేపడతాం.

ఆరో తరగతికి ప్రత్యేక కోచింగ్

అగళి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో ఆరవ తరగతి ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఫిబ్రవరి 25నుంచి మొదలైన విషయం తెలిసిందే. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న పిల్లలకు 11నుంచి 25వరకు ప్రత్యేకంగా కోచింగ్ తరగతులు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ జాఫర్ తెలిపారు. ప్రతిరోజు 4 నుంచి 6 గంటల వరకు క్లాసులు ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బియ్యం కార్డుదారులకు మరో అవకాశం

మడకశిరటౌన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ వ్యాప్తంగా బియ్యం అందని లబ్ధిదారులకు మరోసారి కలెక్టర్ ఆదేశాలతో బియ్యం అందించనున్నారు. 90 శాతం పూర్తి చేసిన డీలర్లకు మరోసారి బియ్యం సరఫరా చేసి రెండు రోజుల్లో ఎఫ్‌పీషాపు నుంచి కార్డు లబ్ధిదారులకు అందించనున్నారు. ఈమేరకు అవసరమైన స్టాకు నివేదికలను కలెక్టర్‌కు నివేదిక పంపినట్లు డీటీ లక్ష్మీనారాయణ తెలిపారు.

పరిపాలన అధికారిగా రాజేంద్రప్రసాద్

అగళి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓగా రాజేంద్రప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టినట్లు ఎంపీడీఓ యాదవేంద్ర తెలిపారు. ఇక్కడ పరిపాలన అధికారిగా పనిచేస్తున్న శ్రీనివాసరావు మడకశిరకు బదిలీకాగా మడకశిర పంచాయతీరాజ్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రాజేంద్రప్రసాద్ ఏఓగా ఇక్కడికి వచ్చారు.

సర్పంచ్‌కు సన్మానం

సోమందేపల్లి, మార్చి10(ఆంధ్రజ్యోతి): గుడిపల్లి పంచాయతీ సర్పంచ్ గిరిజమ్మ నాగరాజరావుకు గ్రామస్థులు సోమవారం సన్మానించారు. వెలగమాకులపల్లి తండా ప్రజలు, గిరిజనుల కమ్యూనిటీ భవనంతోపాటు ప్రహరీ నిర్మించినందుకు కృతజ్ఞతగా దుశ్శాలువ పూలమాలలతో సత్కరించారు.

117 జీవోను రద్దు చేయాలి

సోమందేపల్లి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): గుడిపల్లి, రంగేపల్లి పాఠశాలల్లో ఎంసీఏ సభ్యులచే సోమవారం ఎంఈఓ ఆంజనేయులునాయక్ సమావేశం నిర్వహించారు. 117జీవో రద్దు, పాఠశాలల పునర్వ్యవస్థీకరణపై తీర్మానం చేయించారు. 6, 7, 8తరగతుల విద్యార్థులు ఉన్నత పాఠశాలలో చేర్పించేందుకు తల్లిదండ్రులు సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిపారు. అనంతరం రీస్ట్రక్చరింగ్ ఆఫ్ స్కూల్‌పై చర్చించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రుల సందేహాలను నివృత్తి చేసినట్లు తెలిపారు.

ఓపెన్ జిమ్ కోసం స్థల పరిశీలన

సోమందేపల్లి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఓపెన్ జిమ్ పెట్టేందుకు సోమవారం కూటమి నాయకులు స్థల పరిశీలన చేశారు. మంత్రి సవిత ఆదేశాల మేరకు యువత కోసం జిమ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నీరుగంటి చంద్ర, సిద్ధలింగప్ప, శ్రీరాములు, బాబుల్‌రెడ్డి, కిష్టప్ప, శివశంకర్‌యాదవ్, నాగరాజుయాదవ్, మద్దిలేటి, నటరాజ్, శంకరన్న, ఆనంద్ పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి అందజేత

చిలమత్తూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేజీబీవీ పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు యూటీఎఫ్ నాయకులు సోమవారం పరీక్ష సామగ్రిని అందజేశారు. రాష్ట్ర కార్యదర్శి జయచంద్రారెడ్డి సహకారంతో విద్యార్థినులకు అట్టలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. విద్యార్థులు పరీక్షలను బాగా రాయాలని, పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. శ్రీనివాసులు, లక్ష్మీపతి, వి.శ్రీనివాసులు, నంజప్ప, సురేష్‌కుమార్, అనిల్‌కుమార్, శంకరనారాయణ, జగదీష్, విజయకుమార్, నవీన్, ముత్యాలప్ప పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి నివాళి

పెనుకొండ రూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగలూరు గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ మహ్మద్‌ఖాన్ అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు మాజీ జడ్పీటీసీ నారాయణస్వామి, కన్వీనర్ శ్రీరాములు నాగలూరు గ్రామానికి వెళ్లి మహ్మద్‌ఖాన్ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సాగు భూములకు అసైన్డ్ హక్కులు కల్పించాలి

సోమందేపల్లి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల్లో అసైన్‌మెంట్ హక్కులు కల్పించాలని గుడిపల్లి దళితులు సోమవారం సాగు భూముల సాధన పోరాట కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ మారుతికి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ.. గుడిపల్లికి చెందిన 90మంది దళితులు పందిపర్తి గ్రామంసర్వేనంబరు 384లో ఉన్న ప్రభుత్వ భూమిలో సాగు చేసుకుంటున్నారు. అయితే డిసెంబర్ 17న నిర్వహించిన ప్రజాదర్బార్‌లో మంత్రి సవితకు వినతిపత్రం అందించినట్లు తెలిపారు. అధికారులు భూములు సర్వేచేసి రైతులకు హక్కులు కల్పించాలని కోరారు.

టైలరింగ్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

గోరంట్ల, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం బీసీ, ఈబీసీ, కాపు కులాలకు సంబంధించిన మహిళలకు టైలరింగ్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ నరేంద్రకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 50యేళ్ల లోపు వయస్సున్న మహిళలు సంబంధిత సచివాలయాల్లో కార్యదర్శి ద్వారా వెల్ఫేర్ అసిస్టెంట్‌లాగిన్‌లో శిక్షణకోసం రిజిస్టర్ చేయించుకోవాలన్నారు. ఆసక్తిగలవారు రేషన్, ఆధార్, కులధృవీకరణ పత్రంతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 90రోజుల శిక్షణ ఉంటుందన్నారు. లబ్ధిదారులు వీలును బట్టి సమయం ఎంచుకోవచ్చన్నారు.

పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు

మడకశిర రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు అని మున్సిపల్ కమిషనర్ రంగస్వామి అన్నారు. ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో మండలంలోని ఆర్ అనంతపురం గ్రామంలో ఎన్ఎస్ఎస్ ప్రోగాం ప్రారంభించారు. పారిశుధ్యం, ఆరోగ్యం, నీటి పొదుపుపై అవగాహన కల్పించారు. విద్యార్థులచే గ్రామాల్లో రోడ్లను శుభ్రం చేయించారు. అధ్యాపకులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హిందువులపై దాడిచేసిన వారిని శిక్షించాలి

పెనుకొండ, మర్చి 10(ఆంధ్రజ్యోతి): రాయచోటిలో 4వ తేదీన వీరభద్రస్వామి ఉత్సవం సమయంలో హిందువులపై దాడిచేసిన వారిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని వీహెచ్‌పీ ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు. సోమవారం వివిధ ప్రాంతాలకు చెందిన విశ్వహిందూ పరిషత్ నాయకులు, హిందూసంఘాల నాయకులు, యువకులు, ప్రజలు పెద్దఎత్తున హాజరై పాల్గొన్నారు. స్థానిక మిట్ట ఆంజనేయస్వామి ఆలయం నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు జరిగిన ర్యాలీలో హిందువుల ఐక్యత వర్ధిల్లాలి, రాయచోట అర్బన్ ఎస్ఐను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏఓకు సత్యసాయి జిల్లా కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందించారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు బొక్సంపల్లి రామక్రిష్ణ, కార్యదర్శి పులిచెర్ల వేణుగోపాల్, గోశాయి హరిప్రసాద్, వేదవ్యాస్, రామాంజనేయులు, సుధాకర్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, కదిరి మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, కోన కన్యాశ్రమ స్వామీజీ దత్తనందగిరి, హరీష్ పాల్గొన్నారు.


పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న వీహెచ్‌పీ నాయకులు

వైభవంగా వేంకటేశ్వర స్వామి గ్రామోత్సవం


ముత్యాల పల్లకిలో ఊరేగుతున్న స్వామివారు

మడకశిరటౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోట వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామి వారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. పుష్కర గోపురాల కుంభాభిషేకం, నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాల్లో భాగంగా చివరిరోజు స్వామివారిని ముత్యాలపల్లకిలో ఉంచి గ్రామోత్సవం చేశారు. సాయంత్రం 6 గంటల నుంచి స్వామిని పట్టణంలో రథంపై ఊరేగించారు.

చలో విజయవాడను అడ్డుకోవడం సరికాదు


ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన చేస్తున్న అంగన్‌వాడీలు, సీఐటీయూ నేతలు

పెనుకొండ టౌన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): అంగనవాడీ వర్కర్ల సమస్యలుపరిష్కరించాలని సోమవారం చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని తలపెట్టామని దానిని ఎక్కడికక్కడ పోలీసులు అడ్డుకోవడం సరికాదని సీఐటీయూ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట అంగనవాడీ కార్యకర్తలు నిరసన చేపట్టారు. జిల్లా కార్యదర్శి రమేష్, బాబావలి, రజిత్‌కుమార్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు బంద్

హిందూపురం అర్బన్, మార్చి 10, (ఆంధ్రజ్యోతి): ఉన్నతాధికారుల అనుమతులు లేకుండానే అంగన్‌వాడీ కేంద్రాల'ను బంద్ చేశారు. సీఐటీయూ నాయకుల పిలుపు మేరకు అంగన్‌వాడీ కేంద్రాలు బంద్‌చేసి విజయవాడకు తరలివెళ్లారు. దీనిపై సీడీపీఓ శాంతిని వివరణ కోరగా రాష్ట్రవ్యాప్తంగా ఎవరికీ అనుమతులు లేవని అయినా కార్యకర్తలు తరలి వెళ్లారన్నారు. అయితే కనీసం ఆయాలను ఉంచి కేంద్రాలు నిర్వహించాల్సి ఉందన్నారు. అయితే ధర్నాకు రాకపోయినా సెంటర్లు మాత్రం తెరవకూడదని సెల్‌ఫోన్‌లు తీయకూడదని, స్విచ్‌ఆఫ్ చేసుకోవాలని ధర్నాకు రానివారికి సూచనలు ఇచ్చినట్లు సీడీపీఓ తెలిపారు. అదే విధంగా సెక్టారు మీటింగ్ ఉందని ఎవరికి సెలవు లేదని సోమవారం ఉదయం 9 గంటలకు ఐసీడీఎస్ కార్యాలయం వద్దకు రావాలని సూచించామన్నారు. 12 గంటలైనా ఒకరు కూడా రాలేదని అన్నారు.

ఇరువర్గాలకు రిమాండ్


నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

మడకశిరటౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత ఎస్సీకాలనీలో ఆదివారం రాత్రి అశ్వత్థకట్ట విషయమై ఇరువర్గాలవారికి కోర్టు రిమాండ్ విధించినట్లు ట్రైనీ డీఎస్పీ ఉదయ పావని తెలిపారు. ఆమె మాట్లాడుతూ తలమర్ల రామాంజనేయులు వర్గీయులు, కె.పి.కెంపప్ప వర్గానికి చెందిన ప్రసాద్ వర్గం వారు రాత్రి ఒకరినొకరు గొడవ పడి హత్యాయత్నానికి పాల్పడినట్లు ఇరువర్గాల వారు మడకశిర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.వారిపై కేసు నమోదు చేసి దొమ్మీ, హత్యాయత్నం కేసులో అరెస్టు చేశామన్నారు. అనంతరం మడకశిర కోర్టులో హాజరుపర్చగా ఇరు వర్గాలకు చెందిన తొమ్మిది మందిని రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

ఏడుగిరిపై కేసు నమోదు

గోరంట్ల, మార్చి10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చౌడేశ్వరీకాలనీ, గిరిజనబాలికల గురుకులపాఠశాల వద్ద రెండు క్రైస్తవ చర్చిల వద్ద ఆందోళన చేసిన సంఘటపై ఏడుగురిపై కేసు నమోదుచేసినట్లు సోమవారం సీఐ శేఖర్ తెలిపారు. ఇటీవల చౌడేశ్వరీకాలనీలో అద్దె భవనంలో చర్చిని నిర్వహిస్తూ, మైక్‌ద్వారా ప్రార్థనలు, ఇతర సందేశాలు ఇస్తూప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుండడంతో కాలనీవాసులు స్పందించారు. కాలనీవాసులు బీజేపీ, వీహెచ్‌పీకి చెందినవారితో కలిసి ఆదివారం చర్చిల వద్దకు వెళ్లి అభ్యంతరం తెలిపారు. దీనిపై పాస్టర్ విజయ్‌కుమర్, పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. దీంతో ఏడుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య


నరసింహులు (ఫైల్)

పెనుకొండ టౌన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో నరసింహులు(40) అనే వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు అందించిన వివరాల మేరకు నరసింహులు పెనుకొండ మండలంలోని ఇస్లాపురంలో నివసిస్తున్నాడు. ఇతనికి భార్య అశ్విని, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. నరసింహులు నగర పంచాయతీలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తుండేవాడన్నారు. కుటుంబ కలహాలతోనే ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. రైల్వే పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

మద్యం మత్తులో..


లక్ష్మీకాంత్ (ఫైల్)

హిందూపురం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): లేపాక్షి మండలం తిలక్ నగర్‌లో నివాసమున్న లక్ష్మీకాంత్ (29) అనే యువకుడు రైలు కిందపడి మృతి చెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎర్రిస్వామి తెలిపారు. లక్ష్మీకాంత్ బేల్దారి పనిచేస్తుండేవాడు. కొంత కాలంగా తాగుడుకు బానిసయ్యాడు. ఆదివారం లక్ష్మీకాంత్ తల్లిదండ్రులు బెంగళూరికి వెళ్లారు. ఇంట్లో భార్య మాత్రమే ఉంది. హిందూపురానికి వెళ్లి వస్తానని చెప్పి ఆదివారం రాత్రి ఆటోనగర్ సమీపంలో రైలు కిందపడి మృతిచెందాడు. సోమవారం ఉదయం స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకొని విచారణ చేపట్టారు. అక్కడ దొరికిన ఆనవాళ్లు లక్ష్మీకాంత్‌గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. తండ్రి యల్లప్ప అక్కడికి చేరుకొని తన కుమారుడు అని నిర్ధారించిన తరువాత మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మద్యం మత్తులో రైలుకింద పడినట్లు భావిస్తున్నారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. ప్రస్తుతం భార్య గర్భవతి. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, మార్చి 10(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో సోమవారు ముగ్గురు ఆత్మహత్యకు యత్నించారు. మండలంలోని గోరంట్ల, శెట్టిచిన్నంపల్లికి చెందిన నాగేశ్వరమ్మ, లక్ష్మీకాంత్‌రెడ్డి సోమవారం విషద్రావకం తాగి ఆత్మహత్యకు యత్నించారు. శెట్టిచిన్నంపల్లికి చెందిని ఆనంద్‌రెడ్డి కుమారుడు లక్ష్మీకాంత్‌రెడ్డి కళాశాలలో చదువుతున్నాడు. లక్ష్మీకాంత్‌రెడ్డి విషద్రావకం తాగి అస్వస్థతకు గురయ్యాడు. ఇందుకు కారణం తెలియాల్సి ఉంది. గోరంట్లకు చెందిన వెంకటరెడ్డి భార్య నాగేశ్వరమ్మ కుటుంబ కలహాలతో విషద్రావకం తాగి ఆత్మహత్యకు యత్నించింది. అస్వస్థతకు గురైన వీరిద్దరిని గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం నాగేశ్వరమ్మను అనంతపురం తరలించగా, లక్ష్మీకాంత్‌రెడ్డిని హిందూపురం ఆసుపత్రికి తరలించారు.

వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం..: పట్టణంలోని 1వార్డుకు చెందిన సాకమ్మ (58) అనే వృద్ధురాలు కుటుంబ సమస్యలతో సోమవారం ఆత్మహత్యకు యత్నించింది. గోరంట్ల శివారులోని సొంత పశువుల పాకలో క్లీనింగ్‌కు ఉపయోగించే యాసిడ్‌ను తాగి అస్వస్థతకు గురైంది. ఇటీవల ఆమెకుమారుడు శ్రీనివాసులు (30) అనారోగ్యంతో పశువుల పాక వద్ద ఉరివేసుకుని మృతి చెందారు. కుమారుడి మృతిని జీర్ణించుకోలేక సాకమ్మ ఆత్మహత్యకు యత్నించినట్లు బంధువులు తెలిపారు. అస్వస్థతకు గురైన ఆమెను గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా, వైద్యులు చికిత్సలు చేసి, మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు.